1St Year
Happy Work Anniversary.

షణ్ముఖ
SHANMUKHAVELUGU
# వెలుగు
RNI : APTEL / 2023 / 89152
ప్రతి వార్త వెలుగు వైపు
తెలుగు దినపత్రిక

Good for Health
Best for Readers
THE POWER OF RK PEN

సంపుటి : 3 సంచిక : 28 ఎడిటర్ & పబ్లిషర్ : ఓబులశెట్టి రాధాకృష్ణ దాస్ గురువారం 29 జనవరి 2026 పేజీలు 8 : వెల 3/-ఒంగోలు

VOLUME : 03 ISSUE : 28 EDITOR & PUBLISHER : OBULASETTY RADHAKRISHNA DASS PUBLISHED : ONGOLE Thursday 29 January 2026 PAGES : 8 PRICE : 3/-

## నీటి పారుదల ప్రాజెక్టుల్ని..
# వేగంగా పూర్తిచేయండి

అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణానికి.. ప్రణాళికలు రూపొందించండి

సీమలో ఉద్యాన క్లస్టర్ ఏర్పాటుకు ముందుకొచ్చిన డీపీ వరల్డ్

పూర్వోదయ, సాస్కీ పథకాలపై సమీక్షలో సీఎం చంద్రబాబు



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జనవరి 28)

ప్రకాశం, రాయలసీమ జిల్లాల్లో ఉద్యానరంగ అభివృద్ధిపై సమీక్ష నిర్వహిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు. చిత్రంలో వివిధ శాఖల మంత్రులు, ఉన్నతాధికారులు ఈనాడు, అమరావతి: వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతో కొట్టుకుపోయిన అన్నమయ్య ప్రాజెక్టు నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారుల్ని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఉద్యాన హబ్?గా రాయలసీమతో పాటు, ప్రకాశం, మార్కాపురం జిల్లాలు అభివృద్ధి చెందే అవకాశాలున్నాయని, రాష్ట్రంలో ఉద్యాన క్లస్టర్? ఏర్పాటు కోసం దుబాయికి చెందిన డీపీ వరల్డ్ సంస్థ ముందుకొచ్చిందని వెల్లడించారు. పూర్వోదయ, సాస్కీ, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో 10 జిల్లాల్ని ఉద్యాన రంగానికి కేంద్ర బిందువులుగా మార్చే లక్ష్యంతో రూపొందించిన -మిగతా 2లో

## వెలిగొండపై జగన్‌ది అతిపెద్ద మోసం.. ఆధారాలతో సహా బయటపెట్టిన మంత్రి నిమ్మల

వెలిగొండపై జగన్ ప్రభుత్వం ప్రజలను దగా చేసిందన్న మంత్రి నిమ్మల



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జనవరి 28)

గత వైసీపీ ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టు విషయంలో ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల ప్రజలను ఘోరంగా మోసం చేసిందని, పనులు పూర్తికాకుండానే ఎన్నికల ముందు హడావుడిగా ప్రారంభించి 'క్రెడిట్ చోరీ'కి పాల్పడిందని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల నిర్లక్ష్యాన్ని, ప్రస్తుత కూటమి ప్రభుత్వ హయాంలో జరుగుతున్న పనుల పురోగతిని గణాంకాలు, ఫొటోలతో సహా వివరించారు. 2026 నాటికి వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు మార్గనిర్దేశంలో పనిచేస్తున్నామని స్పష్టం చేశారు.గత మార్చి 6న, ఎన్నికలకు ముందు, నాటి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి వెలిగొండ ప్రాజెక్టును జాతికి అంకితం చేశారని, కానీ ఆ రోజుకు ప్రాజెక్టులో కీలకమైన పనులన్నీ అసంపూర్తిగానే ఉన్నాయని నిమ్మల ఆరోపించారు. "ప్రాజెక్టు పూర్తయితే పండగ వాతావరణం ఉండాలి. కానీ, ఆనాడు 144 సెక్షన్ పెట్టి, రైతు నాయకులను, నిర్వాసితులను హౌస్ అరెస్టులు చేసి పోలీసు పహారా మధ్య ప్రారంభోత్సవం చేయడం, జగన్ ప్రభుత్వ మోసానికి నిలువెత్తు నిదర్శనం" అని ఆయన విమర్శించారు. -మిగతా 2లో

## అమరావతికి చట్టబద్ధత కల్పించండి



(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జనవరి 28)

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ బడ్జెట్ సమావేశాల్లో బిల్లు తీసుకురావాలని తెదేపా, జనసేనలు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాయి. రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, న్యాయశాఖ మంత్రి అర్జున్?రామ్? మేఘ్‌వాల్‌ల ఆధ్వర్యంలో మంగళవారం పార్లమెంట్? ప్రాంగణంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో తెదేపా, జనసేన పార్లమెంటరీ పార్టీ నేతలు లావు శ్రీకృష్ణదేవరాయలు, వల్లభనేని బాలశౌరి ఈ అంశాన్ని ప్రస్తావించారు. సమావేశానంతరం శ్రీకృష్ణదేవరాయలు -మిగతా 2లో

## అజిత్ పవార్ విమాన ప్రమాదం.. 'రీడ్‌బ్యాక్' చేయని పైలట్..

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జనవరి 28)

మహారాష్ట్ర ఉపముఖ్యమంత్రి అజిత్ పవార్ ప్రయాణిస్తున్న విమానం బుధవారం ఉదయం బారామతిలో ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఆయనతో పాటు మరో నలుగురు ప్రాణాలు



కోల్పోయిన సంగతి తెలిసిందే. ఉదయం 8.46 గంటలకు రన్?వేకు 100 అడుగుల దూరంలో విమానం ప్రమాదానికి గురైనట్లు సీసీటీవీ దృశ్యాలను బట్టి వెల్లడైంది. దానికి 12 నిమిషాల -మిగతా 2లో

## మహాపాపం చేసి కూడా బుకాయించుకోవడం జగన్‌కే చెల్లింది: మంత్రి లోకేశ్



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జనవరి 28)

తిరుమల లడ్డూ విషయంలో మహాపాపం చేసి కూడా బుకాయించుకోవడం వైకాపా అధినేత జగన్‌కే చెల్లిందని మంత్రి నారా లోకేశ్ విమర్శించారు. కల్తీ జరిగిందని నిర్ధరణ అయ్యాక కూడా నివేదికను వక్రీకరిస్తూ -మిగతా 2లో

## చంద్రబాబు ప్రభుత్వంపై
# నిప్పులు చెరిగిన జగన్

రెండేళ్ల చంద్రబాబు పాలన 'జంగల్ రాజ్'లా ఉందని జగన్ విమర్శ

మద్యం, ఇసుక మాఫియాలతో రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపణ

టీడీపీ ఎమ్మెల్యేలు మహిళలపై అరాచకాలకు పాల్పడుతున్నా చర్యలు శూన్యమని వ్యాఖ్య

సంక్రాంతి పండుగను జూదం, అశ్లీల నృత్యాలతో భ్రష్టు పట్టించారని విమర్శ



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జనవరి 28)

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని టీడీపీ కూటమి ప్రభుత్వంపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. భీమవరం పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గడిచిన రెండేళ్ల పాలనలో రాష్ట్రంలో 'జంగల్ రాజ్' నడుస్తోందని, 'దోచుకో, పంచుకో, తినుకో' అనే రీతిలో పాలన సాగుతోందని ఘాటుగా విమర్శించారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ హామీలన్నీ అబద్ధాలేనని తేలిపోయిందని అన్నారు."చంద్రబాబు ప్రభుత్వం వచ్చి రెండేళ్లు కావస్తోంది. ఈ రెండేళ్లలో రైతులు, మహిళలు, యువత సహా ఏ ఒక్క వర్గానికైనా మంచి జరిగిందా మా ప్రభుత్వంలో అమలు చేసిన పథకాలన్నీ రద్దు చేశారు. -మిగతా 2లో

## జనసేన కాదు.. కామసేన ఎమ్మెల్యే శ్రీధర్ వీడియోపై భగ్గుమన్న ఆర్కే రోజా

జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్ వీడియో లీక్‌పై రోజా తీవ్ర ఆగ్రహం



(షణ్ముఖ వెలుగు, అమరావతి,జనవరి 28)

ఇది జనసేన కాదు, కామాంధుల సేన అంటూ తీవ్ర విమర్శలు
నగరిలో వైసీపీ నేతలతో కలిసి రోడ్డుపై బైఠాయించి నిరసన
పవన్, చంద్రబాబు, హోంమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్
మహిళల భద్రతలో కూటమి ప్రభుత్వం విఫలమైందని ఆరోపణ

జనసేన ఎమ్మెల్యే అరవ శ్రీధర్?కు సంబంధించిన రాసలీలల వీడియో వ్యవహారం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ఘటనపై మాజీ మంత్రి, వైసీపీ నాయకురాలు ఆర్కే రోజా తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇది జనసేన కాదని, మహిళల జీవితాలతో ఆడుకుంటున్న 'కామసేన' అని ఆమె తీవ్రంగా ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే శ్రీధర్?ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ ఈరోజు ఆమె సొంత నియోజకవర్గమైన నగరిలో వైసీపీ శ్రేణులతో కలిసి భారీ నిరసన చేపట్టారు.

ఈ ఆందోళనలో భాగంగా తిరుపతి, చిత్తూరు జిల్లాల వైసీపీ అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి, ఎమ్మెల్సీ చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీ రెడ్డప్ప తదితరులతో కలిసి రోజా ఏజేఎస్ కళ్యాణ మండపం నుంచి ఓం శక్తి ఆలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రోడ్డుపై బైఠాయించి -మిగతా 2లో



## అజిత్ పవార్ మరణం.. మమతాబెనర్జీ కీలక వ్యాఖ్యలు

(షణ్ముఖ వెలుగు,ఢిల్లీ,జనవరి 28)

విమాన ప్రమాదంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్‌పవార్ ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీ స్పందిస్తూ.. కీలక వ్యాఖ్యలు చేశారు. పవార్ మృతిలో కుట్రకోణం ఉందనే అనుమానం వ్యక్తం చేశారు. మమత మీడియాతో మాట్లాడుతూ.. పవార్ మరణ వార్త విని తాను తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యానన్నారు. ఈ ప్రమాదం దేశంలోని రాజకీయ నాయకుల భద్రతపై ప్రశ్నలు లేవనెత్తుతుందన్నారు. ఈ ఘటనపై సుప్రీంకోర్టు పర్యవేక్షణలో దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. అత్యున్నత న్యాయస్థానం పైనే తమకు నమ్మకం ఉందన్నారు. మరే ఇతర దర్యాప్తు సంస్థల పైనా తమకు విశ్వాసం లేదని.. అవి వాటి స్వేచ్ఛను కోల్పోయాయని ఆరోపించారు. ఈ సందర్భంగా పవార్ భాజపాను వీడాలని ఆలోచిస్తున్నారని ఇటీవల జరిగిన ప్రచారం గురించి మమత ప్రస్తావించారు. ఇక, పవార్ విమాన ప్రమాదంపై సమగ్ర దర్యాప్తు జరపాలని పలువురు రాజకీయ నాయకులు కూడా డిమాండ్ చేశారు. ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్, కాంగ్రెస్ ఎంపీ గౌరవ్ గొగోయ్‌లు ఎక్స్ వేదికగా పవార్‌మృతికి సంతాపం తెలిపారు. ఈ ఘటనపై పారదర్శకమైన దర్యాప్తు చేయాలని కోరారు.

## లో వోల్టేజీ సమస్యలకు స్వస్తి

### రెండు నూతన సబ్ స్టేషన్ల నిర్మాణానికి గొట్టిపాటి పచ్చజెండా

### అద్దంకి నియోజకవర్గంలో విద్యుత్ వెలుగులు రెండు నూతన 33/11 కేవీ సబ్ స్టేషన్లు మంజూరు చేసిన మంత్రి గొట్టిపాటి రవికుమార్



(షణ్ముఖ వెలుగు, అద్దంకి, జనవరి 28) నియోజకవర్గ ప్రజలకు విద్యుత్ అంతరాయాలు లేని మెరుగైన, నిరంతర విద్యుత్ అందించడమే లక్ష్యంగా రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అద్దంకి నియోజకవర్గ పరిధిలో రూ.8.99 కోట్ల అంచనా వ్యయంతో రెండు నూతన 33/11 కేవీ సబ్ స్టేషన్లను మంజూరు చేసినట్లు ఆయన ప్రకటించారు. పేరాయపాలెం సబ్ స్టేషన్ (అద్దంకి మండలం) సుమారు రూ. 4.63 కోట్ల వ్యయంతో ఈ సబ్ స్టేషన్ నిర్మించనున్నారు. దీని ద్వారా పేరాయపాలెం, ధేనువకొండ, ఒమ్మినేనివారిపాలెం గ్రామాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందనుందన్నారు. తూర్పు కొప్పెరపాడు సబ్ స్టేషన్ (జే. పంగులూరు మండలం) సుమారు రూ. 4.36 కోట్ల వ్యయంతో ఈ సబ్ స్టేషన్ నిర్మాణం చేపట్టనున్నారు. దీని ఫలితంగా తూర్పు కొప్పెరపాడు, తక్కెళ్ళపాడు, చందలూరు, నూజెళ్ళపల్లి గ్రామాల్లో లో-వోల్టేజీ సమస్యలు తొలగి, నిరంతర విద్యుత్ అందుబాటులోకి రానుండటంతో, ప్రజల అవసరాలను గుర్తించి,నూతన సబ్ స్టేషన్ల ఏర్పాటు పట్ల స్థానిక ప్రజలు మరియు రైతాంగం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## ఏసిడిపిఓ కె అంజయమ్మకి సమ్మె నోటీసు



(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 28)

ఏ.పీ అంగన్వాడి వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ఒంగోలు ప్రాజెక్ట్ కమిటీ ఆధ్వర్యంలో ఏసిడిపిఓ కె అంజయమ్మకి సమ్మె నోటీసు బుధవారం అందజేశారు. ఫిబ్రవరి 12వ తేదీన జాతీయ సమ్మె చేయాలని కోరుతూ ఏపీ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్ యూనియన్ ఒంగోలు ప్రాజెక్టు కమిటీ ఆధ్వర్యంలో అధికారులకు సంబంధించి అందజేశారు. 2026 ఫిబ్రవరి 12వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ పాల్గొంటున్నారని, అంగన్వాడి వర్కర్స్ సమస్యలు పరిష్కారం చేయడంలో కేంద్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని కేంద్ర కార్మిక సంఘాలు ఆధ్వర్యంలో జరిగే సమ్మెను పాల్గొంటున్నారని తెలియజేశారు. అంగన్వాడి వర్కర్స్‌కు కనీస వేతనాలు అమలు చేయాలని, నాలుగు లేబర్ కోడ్‌లు, నియమాలు, వాటి చట్టాలు రద్దు చేయాలని ఐసిడిఎస్ 50 సంవత్సరాలు పూర్తవుతున్నా నేటికీ కనీస సౌకర్యాలు మౌళిక వసతులు, పౌష్టికాహారం అంది ంచడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందాయన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, రిటైర్డ్ అయిన అంగన్వాడి కార్మికులకు రూ.10 వేలు పెన్షన్ ఇవ్వాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, రాజకీయ వేధింపులు ఆపాలని గత సమ్మె ఒప్పందాలు అమలు చేయాలని, ఖాళీగా ఉన్న అంగన్వాడి ఆయాల పోస్టులను భర్తీ చేయాలని తదితర డిమాండ్ల పై జరిగే సమ్మెను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఒంగోలు నగర కన్వీనర్ టి మహేష్, యూనియన్ ఒంగోలు ప్రాజెక్ట్ కార్యదర్శి కె ఏమీమా, సిఐటియు ఒంగోలు నగర నాయకులు జి నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## జడ్పీ పాఠశాలలో ఆర్వో ప్లాంట్‌కు నగదు బహూకరణ



(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జనవరి 28) స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బుధవారం పూర్వ విద్యార్థి సయ్యద్ అహ్మద్ హుస్సేన్ తాను చదువుకున్న పాఠశాలకు రూ.40 వేలు ఆర్‌ఓ ప్లాంట్ రిపేరుకు విరాళంగా అందించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై వెంకటేశ్వరరావు తెలిపారు. 1978 బ్యాచ్ పదవ తరగతి పూర్తి చేసుకుని పాఠశాలను గుర్తించుకుని తలవంతగా పాఠశాలకు విరాళామందించినట్లు తెలిపారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దాతల సహాయం మరువలేనిదని వారికి అభినందన్ తెలిపారు. వీరి వెంట కొమ్మి వెంకటరావు, విశ్రాంత ఉపాధ్యాయుడు బి వెంకట్రావు ఉన్నారు.

మొదటి పేజీ తరువాయి

## నీటి పారుదల ప్రాజెక్టుల్ని.. వేగంగా పూర్తిచేయండి

అభివృద్ధి ప్రణాళికలపై సీఎం చంద్రబాబు క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. 'రాయలసీమ.. ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లోని నీటి పారుదల ప్రాజెక్టుల్ని త్వరితగతిన పూర్తిచేయాలి. తక్కువ నిధులతో త్వరగా పూర్తయ్యే వాటిని తొలుత చేపట్టాలి. గాలేరు-నగరి ప్రాజెక్టు ద్వారా కృష్ణా జలాల్ని కడపకు తీసుకెళ్లడంపై దృష్టి సారించాలి. ఉత్తరాంధ్ర జిల్లాల్లోనూ ప్రాజెక్టులు చేపట్టాలి. పోలవరం ఎడమ కాల్వ పనులు పూర్తయితే గోదావరి జలాల్ని ఉత్తరాంధ్రకు తీసుకెళ్లొచ్చు. అప్పుడు పోలవరం-వంశధార నదుల అనుసంధానాన్ని చేపట్టవచ్చు' అని అన్నారు.

**ప్రపంచ మార్కెట్‌కు అనుగుణంగా...**

ప్రపంచ మార్కెట్‌లో డిమాండుకు అనుగుణంగా ఉద్యాన ఉత్పత్తులు పండించేలా ప్రణాళికలు తయారు చేయాలని చంద్రబాబు ఆదేశించారు. 'ఉద్యాన ఉత్పత్తుల్లో రాయలసీమ ప్రాంతం దేశంలోనే అగ్ర స్థానంలో ఉంది. అందుకు అనుగుణంగా ఎకోసిస్టంను అభివృద్ధి చేయాలి. ఉద్యానరంగంలో ప్రైవేటు పెట్టుబడులను సాధించాలి. ఆహారశుద్ధి యూనిట్లు, పోర్టుల అనుసంధానం, గోదాములు, లాజిస్టిక్స్? ప్రణాళికలు రూపొందించాలి' అని చెప్పారు. 'నీటి పారుదల రంగాన్ని వైకాపా ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. చాలా ప్రాజెక్టుల్ని పెండింగ్‌లో పెట్టింది' అని సమీక్షలో పాల్గొన్న జలవనరుల శాఖ మంత్రి రామానాయుడు, ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ విమర్శించారు. 'నీటి పారుదల ప్రాజెక్టులు పూర్త యితే రాయలసీమ.. ప్రకాశం, మార్కాపురం జిల్లాల్లో ఉద్యాన పంటల సాగు అపారంగా పెరుగుతుంది. 10 జిల్లాల్లోని 201 క్లస్టర్లు, 303 మండలాల్లో ఉద్యాన సాగు అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాం' అని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. సమావేశంలో సీఎస్ విజయానంద్, ఆర్థిక, జలవనరులు, వ్యవసాయ, ఉద్యాన, పోర్టులు, ఆర్?అండ్?బీ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జనసేన కాదు.. కామసేన ఎమ్మెల్యే శ్రీధర్ వీడియోపై భగ్గుమన్న ఆర్కే రోజా

ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అధికార మదంతో ఒక మహిళా ఉద్యోగిని బెదిరించి, ఆమె జీవితాన్ని నాశనం చేసిన కీచక ఎమ్మెల్యేను తక్షణమే శిక్షించాలని డిమాండ్ చేశారు.

**పవన్, చంద్రబాబు, హోంమంత్రిపై తీవ్ర విమర్శలు**

ఈ సందర్భంగా రోజా మాట్లాడుతూ జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్?పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "ఆడవాళ్లకు అన్యాయం చేస్తే రోమాలు పీకేస్తా, చర్మం ఒలుస్తా అని ఊగిపోయే పవన్ కల్యాణ్ ఇప్పుడు ఎక్కడ ఏం చేస్తున్నారు" అని సూటిగా ప్రశ్నించారు. "గతంలో జానీ మాస్టర్, కిరణ్ రాయల్, వినూత్న వంటి వారు తప్పు చేసినప్పుడే కఠిన చర్యలు తీసుకుని ఉంటే, ఈరోజు మీ ఎమ్మెల్యే శ్రీధర్ ఇంతటి దుశ్చర్యకు పాల్పడేవాడా" అని నిలదీశారు. వీడియోలో ఆధారాలు స్పష్టంగా కనిపిస్తున్నప్పటికీ, త్రీ-మెన్ కమిటీ వేసి కాలయాపన చేయడం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు ఇచ్చే ప్యాకేజీలు, స్పెషల్ ఫ్లైట్ల కోసమే పవన్ రాష్ట్రానికి వస్తారని, ప్రజల కష్టాలను పట్టించుకోరని ఆరోపించారు.అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, హోంమంత్రి వంగలపూడి అనితపైనా రోజా విమర్శల వర్షం కురిపించారు. మహిళా హోంమంత్రి ఉన్నప్పటికీ రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని, తన సొంత జిల్లా విశాఖలో డ్రగ్స్, గంజాయిని అరికట్టలేని మంత్రి రాష్ట్రాన్ని ఏం కాపాడతారని ఎద్దేవా చేశారు. గతంలో కాల్ మనీ సెక్స్ రాకెట్ అయినా, ఇప్పుడు సొంత పార్టీ, మిత్రపక్ష ఎమ్మెల్యేల అరాచకాలైనా మహిళలను కాపాడటంలో చంద్రబాబు పూర్తిగా విఫలమయ్యారని, ఆయనో 'చేతగాని దద్దమ్మ ముఖ్యమంత్రి' అని తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్, హోంమంత్రి అనిత తక్షణమే తమ పదవులకు రాజీనామా చేయాలని రోజా డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వంలో మహిళల ఆత్మగౌరవానికి రక్షణ లేదనడానికి ఈ ఘటనే నిదర్శనమని ఆమె పేర్కొన్నారు. వైసీపీ ఆందోళనతో నగరిలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది.

## మహాపాపం చేసి కూడా బుకాయించుకోవడం జగన్‌కే చెల్లింది: మంత్రి లోకేశ్

తప్పుదోవ పట్టిస్తున్నారని మండిపడ్డారు. "పాలే లేని కల్తీ నెయ్యి సృష్టించి దేవుడి ప్రసాదాన్ని అపవిత్రం చేయడం క్షమించరాని నేరం. వందల కోట్ల కుంభకోణానికి పాల్పడటమే కాకుండా అసత్యాలు ప్రచారం చేస్తున్నారు. వైకాపా కుట్రలను దీటుగా తిప్పికొట్టడంతోపాటు వారి వ్యవహారాన్ని ప్రజల్లోనే ఎండగడదాం" అని లోకేశ్ అన్నారు.

## చంద్రబాబు ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన జగన్

మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా భావించి ప్రతి హామీని నెరవేర్చిన పాలన మాది. కానీ ఇప్పుడు హామీలను మోసపూరితంగా గాలికొదిలేశారు. ఎన్నికలప్పుడు బాండ్లు పంచిపెట్టి ప్రజలను దగా చేశారు. ఇలాంటి మోసాలు చేసే వారిపై 420 కేసులు పెడతారు. కానీ చంద్రబాబు, ఆయన కూటమి నేతలు మాత్రం బయట తిరుగుతున్నారు," అని జగన్ విమర్శించారు.రాష్ట్రంలో విచ్చలవిడి అవినీతి రాజ్యమేలుతోందని జగన్ ఆరోపించారు. "మద్యం వ్యాపారం మొత్తం మాఫియా చేతుల్లోకి వెళ్లింది. ప్రైవేట్ షాపులన్నీ వాళ్ల మనుషులకే ఇచ్చారు. గ్రామాల్లో బెల్ట్ షాపులను వేలం పెట్టి మరీ అమ్ముకుంటున్నారు. ఎంఆర్?పీ కంటే ఎక్కువ ధరకు అమ్ముతూ, పర్మిట్ రూమ్‌లు నడుపుతూ, కల్తీ మద్యం అమ్ముతూ ప్రజల రక్తం తాగుతున్నారు. ఇసుక మా హయాంలో ప్రభుత్వానికి ఏటా రూ.750 కోట్లు ఆదాయం తెచ్చిపెడితే, ఇప్పుడు ఫ్రీ అని చెప్పి అక్రమంగా తవ్వేస్తూ రెట్టింపు ధరకు అమ్ముతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు," అని జగన్ ఆరోపించారు.

సంక్రాంతి పండుగను జూదం, అశ్లీల నృత్యాలతో భ్రష్టు పట్టించారని, ఇది జంగల్ రాజ్ కాకపోతే మరేమిటని ఆయన ప్రశ్నించారు. "రోడ్లపై రికార్డింగ్ డ్యాన్సులు, మొబైల్ వ్యాన్లలో మద్యం అమ్మకాలు జరిపారు. ఈ అరాచకాల కోసం నియోజకవర్గాల్లో వేలం పాటలు నిర్వహించారు. 'ఊపేయ్, కుదిపేయ్' అంటూ యూనిఫామ్?లో ఉన్న డీఎస్పీనే ప్రోత్సహించడం సిగ్గుచేటు," అని మండిపడ్డారు.

టీడీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు మహిళలపై అరాచకాలకు పాల్పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని జగన్ ఆరోపించారు. "కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ ఒక ప్రభుత్వ ఉద్యోగినిని రేప్ చేస్తే, ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ వేధింపులతో ఒక ప్రిన్సిపాల్ ఆత్మహత్యాయత్నం చేస్తే చర్యలు లేవు. సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, మంత్రి సంధ్యారాణి పీఏ, గుంటూరు ఈస్ట్ ఎమ్మెల్యే నజీర్‌లపై తీవ్ర ఆరోపణలు వచ్చినా పట్టించుకోలేదు. స్వయంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ అశ్లీల నృత్యాలు చేస్తూ చిందులేస్తున్నారు. చంద్రబాబు, ఆయన కుమారుడే వీరందరినీ ప్రోత్సహిస్తున్నారు," అని జగన్ ఆరోపించారు.ఇంకో ఏడాదిన్నరలో తన పాదయాత్ర ప్రారంభమవుతుందని, సుమారు 150కి పైగా నియోజకవర్గాల్లో పర్యటించి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతానని జగన్ ప్రకటించారు. "కళ్లు తెరిచి మూసేలోగా మూడేళ్లు గడిచిపోతాయి. నా పాదయాత్ర మొదలైతే ప్రజల్లోనే ఉంటాను. చంద్రబాబు ప్రభుత్వ అన్యాయాలను ప్రతి ఇంట్లోనూ చర్చ జరిగేలా చేయాలి. కార్యకర్తలు సంఘటితంగా ఉండి, అనుబంధ విభాగాలను బలోపేతం చేయాలి. జగన్ 2.0లో కార్యకర్తలకే ప్రథమ స్థానం ఉంటుంది," అని ఆయన భరోసా ఇచ్చారు.

## వెలిగొండపై జగన్‌ది అతిపెద్ద మోసం.. ఆధారాలతో సహా బయటపెట్టిన మంత్రి నిమ్మల

**పూర్తి కాని పనులు.. ప్రమాదకర స్థితి**

మంత్రి నిమ్మల ప్రాజెక్టులోని ప్రతి దశలోనూ వైసీపీ ప్రభుత్వం వదిలేసిన పనులను వివరంగా తెలియజేశారు.హెడ్ రెగ్యులేటర్: శ్రీశైలం నుంచి నీటిని టన్నెల్?లోకి మళ్లించే హెడ్ రెగ్యులేటర్ వద్ద 4,300 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పని మిగిలి ఉండగానే ప్రాజెక్టును ప్రారంభించారని తెలిపారు. దానికి రక్షణగా ఉండే వింగ్స్, రిటర్న్స్ నిర్మించకపోవడంతో నీటిని వదిలితే మొత్తం నిర్మాణం కూలిపోయే ప్రమాదం ఉండేదని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నట్లు చెప్పారు.టన్నెల్ 1 & 2: టన్నెల్ 1లో 1.20 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించాల్సి ఉందని, టన్నెల్ 2లో దాదాపు 7 కిలోమీటర్ల లైనింగ్, 4,924 మీటర్ల బెంచింగ్ పనులు పెండింగ్?లో ఉన్నాయని వివరించారు. "లైనింగ్ చేయకుండా నీటిని వదిలితే సొరంగం కూలిపోయే ప్రమాదం ఉంది. వైకాపా ప్రభుత్వం ఐదేళ్లలో కేవలం 702 మీటర్ల లైనింగ్ చేస్తే, మేము 18 నెలల్లోనే 3,708 మీటర్ల పని పూర్తి చేశాం" అని ఆయన పోల్చి చెప్పారు.

టన్నెల్ బోరింగ్ మెషిన్ (టీబీఎం): టన్నెల్ 2లో 11వ కిలోమీటరు వద్ద 600 అడుగుల పొడవైన భారీ టన్నెల్ బోరింగ్ మెషిన్ (టీబీఎం) చిక్కుకుపోయిందని, అది నీటి ప్రవాహాన్ని పూర్తిగా అడ్డుకుంటుందని తెలిపారు. దాన్ని తొలగించకుండా హైకోర్టు ఇచ్చిన స్టేను వెకేట్ చేయించడానికి కూడా గత ప్రభుత్వం ప్రయత్నించలేదని ఆరోపించారు.ఫీడర్ కెనాల్, నిర్వాసితులు: 11,500 క్యూసెక్కుల నీటిని తట్టుకోవాల్సిన 21 కిలోమీటర్ల ఫీడర్ కెనాల్, చిన్నపాటి వర్షానికే గండ్లు పడిన దారుణ స్థితిలో ఉందని ఫోటోలు చూపించారు. ఇప్పుడు రూ.456 కోట్లతో ఈ పనులను ప్రారంభించామని తెలిపారు. అత్యంత ముఖ్యంగా, ప్రాజెక్టు కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు ఇవ్వాల్సిన రూ.900 కోట్ల ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని గత ప్రభుత్వం చెల్లించలేదని, పునరావాస కాలనీల నిర్మాణం చేపట్టలేదని మండిపడ్డారు.

## అమరావతికి చట్టబద్ధత కల్పించండి

విలేకర్లతో మాట్లాడుతూ తాము తెదేపా తరఫున 3 జాతీయ, 5 రాష్ట్ర అంశాలపై పార్లమెంటులో చర్చ చేపట్టాలని కోరినట్లు చెప్పారు. 'రాష్ట్ర అంశాల్లో ప్రధానమైనది అమరావతి. రాష్ట్ర విభజన తర్వాత వచ్చిన తెదేపా ప్రభుత్వం అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా నిర్ణయించినప్పటికీ 2019-24 వరకు ఉన్న వైకాపా ప్రభుత్వం మూడు రాజధానుల పేరుతో అందర్నీ అయోమయంలో పడేసింది. ఇలాంటి పరిస్థితే ఉంటే పెట్టుబడులు పెట్టడానికి ఎవరూ రారు. రాజధాని కోసం 33 వేల ఎకరాలు ఇచ్చిన రైతులకూ ఇబ్బందులు రావచ్చు. ఈ అనిశ్చితిని తొలగించడానికి అమరావతిని ఆంధ్రప్రదేశ్ రాజధానిగా ప్రకటించే బిల్లును ఈ బడ్జెట్ సమావేశాల్లోనే తీసుకురావాలని విజ్ఞప్తి చేశాం' అన్నారు. అమరావతిపై కేంద్ర ప్రభుత్వం కొత్త బిల్లు తీసుకొస్తుందని భావిస్తున్నట్లు చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రానికీ కేంద్ర ప్రభుత్వం రాజధానిని నిర్ణయించలేదన్న వాదనలను ఆయన కొట్టిపారేశారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలో తెలంగాణ రాజధానిగా హైదరాబాద్?ను కేంద్రమే నిర్ణయించిందని గుర్తు చేశారు. గత బడ్జెట్‌లో ప్రకటించిన పూర్వోదయ పథకం కింద నిధులు త్వరగా విడుదల చేయాలని, నదుల అనుసంధానంపై సభలో చర్చించాలని కోరినట్లు చెప్పారు.

జలజీవన్ మిషన్ కింద రాష్ట్రానికి రూ.26 వేల కోట్లు వస్తే వైకాపా ప్రభుత్వం కేవలం రూ.2 వేల కోట్లే వినియోగించిందని పేర్కొన్నారు. ఆ పథకాన్ని పునరుద్ధరించి రాష్ట్రానికి రావాల్సిన రూ.26 వేల కోట్లు ఇవ్వడంపై చర్చించాలని కోరామన్నారు. పొగాకు కొనుగోళ్లు చాలాచోట్ల ఆగిపోయాయని, దీనిపై కూడా చర్చకు అనుమతించాలని విజ్ఞప్తి చేశామన్నారు. అవినీతి కేసుల్లో ఉన్న కొందరు నాయకులపై ఛార్జిషీట్లు దాఖలైనా కేసులు ముందుకు సాగట్లేదని, ప్రత్యేక కోర్టులు పెట్టి నేరచరితులకు త్వరగా శిక్షలు పడేలా చేయడంపై సభలో చర్చించాలని కోరినట్లు శ్రీకృష్ణదేవరాయలు చెప్పారు. 16 ఏళ్లలోపు పిల్లలపై సామాజిక మాధ్యమాలు దుష్ప్రభావం చూపుతున్నందున వాటిని పిల్లలు ఉపయోగించకుండా నిషేధించే అంశంపైనా చర్చించాలని కోరామన్నారు.

## అజిత్ పవార్ విమాన ప్రమాదం.. 'రీడ్‌బ్యాక్' చేయని పైలట్..

ముందు ఏడీఎస్-బీ రేడియో సిగ్నళ్లను ప్రసారం చేయడం నిలిపివేసింది. వీటి ద్వారా ఎప్పటికప్పుడు విమానం లొకేషన్?, వేగం తెలుస్తుంది. ఈ ఘటన గురించిన వివరాలను వెల్లడిస్తున్న సమయంలో పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు 'రీడ్‌బ్యాక్' అనే పదం వాడారు. ల్యాండింగ్ క్లియరెన్స్ సమయంలో పైలట్లు రీడ్‌బ్యాక్ చేస్తుంటారు.

రీడ్‌బ్యాక్ అనేది ఒక ప్రొటోకాల్.. అందులో సందేశం ఏమీ ఉండదు. అయితే ల్యాండింగ్‌కు సంబంధించి అధికారిక అనుమతిని పొందే సమయంలో దీనిని వాడతారు. రీడ్‌బ్యాక్ అంటే ఒక సందేశాన్ని మళ్లీ చదవడమే. అంటే ఎయిర్‌క్రాఫ్ట్ సిబ్బంది, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ మధ్య సమన్వయ లోపం లేదని ఇది నిర్ధారిస్తుంది. ల్యాండింగ్ అవుతున్నప్పుడు ఈ రీడ్‌బ్యాక్ చాలా కీలకం. ఏ రన్?వేను ఉపయోగించాలి.. వాతావరణం ఎలా ఉంది.. విమానం వేగం, ఎత్తు మార్చుకున్నప్పుడు.. విమానం ల్యాండ్ అయ్యే ప్రాంతంలో ట్రాఫిక్ ఎలా ఉందనే విషయాలపై పైలట్, ఏటీసీ మధ్య కమ్యూనికేషన్‌కు ఇది ఉపయోగపడుతుంది.

అయితే తాజా ఘటనలో లియర్‌జెట్ పైలట్ శాంభవి పాఠక్.. ఈ రీడ్‌బ్యాక్ ఇవ్వలేదు. రన్‌వే కనిపిస్తుందా లేదా అని పైలట్లను బారామతి ఏటీసీ అధికారులు అడిగారని, కనిపించడం లేదనే సమాధానం వచ్చిందన్నారు. దాంతో విమానం గాల్లో కొంతసేపు చక్కర్లు కొట్టినట్లు కేంద్ర మంత్రి వివరించారు. రెండోసారి ల్యాండింగ్‌కు ప్రయత్నించే సమయంలో రన్‌వే కనిపిస్తుందా అని ఏటీసీ అడిగినప్పుడు పైలట్లు సానుకూలంగా స్పందించారని తెలిసిందన్నారు. దీంతో ల్యాండింగ్ కోసం ఏటీసీ క్లియరెన్స్ ఇచ్చిందని.. ఆ వెంటనే విమానం కూలిపోయిందన్నారు.

శాంభవి.. న్యూజిలాండ్ ఇంటర్నేషనల్ కమర్షియల్ పైలట్ అకాడమీలో కమర్షియల్ పైలట్ శిక్షణ తీసుకుని లైసెన్స్ పొందారు. ఆ తర్వాత భారత్‌కు వచ్చి డీజీసీఏ నుంచి కమర్షియల్ పైలట్ లైసెన్స్‌తో పాటు ఫ్రోజెన్‌ఎయిర్‌లైన్ ట్రాన్స్‌పోర్ట్ పైలట్ లైసెన్స్ కూడా పొందారు. కొత్త పైలట్లకు శిక్షణ ఇచ్చేలా అసిస్టెంట్‌ఫ్లైట్ ఇన్‌స్ట్రక్టర్‌గానూ పనిచేశారు. 2022 ఆగస్టు నుంచి వీఎస్ఆర్ వెంచర్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఫుల్ టైమ్ ఫస్ట్ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.

## ఏకీకృత కుటుంబ సర్వే, అక్షర ఆంధ్ర పై అవగాహన





(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జనవరి 28) మండలంలోని సింగరభట్ల పాలెం, పై రెడ్డిపాలెం గ్రామ సచివాలయంలో బుధవారం ఎంపీడీవో పి సుజాత ఏకీకృత కుటుంబ సర్వే, అక్షర ఆంధ్ర పై సిబ్బందికి అవగాహన నిర్వహించారు. సుజాత మాట్లాడుతూ సర్వేలు మొత్తం పూర్తిస్థాయిలో కంప్లీట్ చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రతిరోజు రెండుసార్లు హాజరు ఇన్ టైం లో వెయ్యాలని సర్వేలు ఫీల్డ్ విజిట్లు కోసం బయటికి వెళ్లేటప్పుడు మూమెంట్ రిజిస్టర్ లో తప్పనిసరిగా నమోదు చేసి వెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు గీత, నారాయణ, అరుణకుమారి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.





ప్రకాశం | మార్కాపురం | బాపట్ల

షణ్ముఖ
# వెలుగు
ప్రతి వార్త వెలుగు వైపు    తెలుగు దినపత్రిక
29.01.26    గురువారం


## దొంగతనాల కట్టడితో పాటు చోరీ సొత్తు రికవరీపై ప్రత్యేక దృష్టి సారించాలి

**విధి నిర్వహణలో ప్రతిభ కనపరిచిన పోలీస్ అధికారాలు, సిబ్బంది అభినందించిన జిల్లా ఎస్పీ**

**విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే సహించేదిలేదు**

**ఉమ్మడి జిల్లా పోలీసు అధికారుల సమావేశంలో జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్‌రాజు**




**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జనవరి 28)**

ఉమ్మడి ప్రకాశం, మార్కాపురం జిల్లాలోని కనిగిరి సబ్ డివిజన్‌తో పాటు ఒంగోలు, దర్శి డిఎస్పీలు, సిఐలు, ఎస్ఐలతో బుధవారం ఎస్పీ జిల్లా పోలీసు కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎస్పీ ముఖ్యంగా గ్రేవ్ కేసులు, ప్రాపర్టీ కేసులు, హత్య కేసులు, పెండింగ్ నాన్ బెయిలబుల్ వారెంట్స్, రోడ్డు ప్రమాదాలు, దేవాలయాల వద్ద భద్రత ఏర్పాట్లు, అయా సబ్ డివిజన్ లోని సిసికెమెరాల పనితీరు, ఎన్ఫోర్స్మెంట్, ఇతర అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. పెండింగ్ కేసులపై ప్రత్యేక శ్రద్ధ వహించి త్వరితగతిన పరిష్కరించాలని, ప్రాపర్టీ నేరాల కట్టడి, నిందితులు గుర్తింపు, రికవరీకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దొంగ సొత్తు రికవరీ చేయాలని, అనుమానితుల వ్యక్తులను ఫింగర్ ప్రింట్ మొబైల్ సెక్యూరిటీ చెక్ డివైస్ ద్వారా ఫింగర్ ప్రింట్ సేకరించి తనిఖీ చేయాలన్నారు. మహిళలపై జరిగే నేరాలు, పోక్సో కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేసి భాదితులకు న్యాయం చేకుర్చాలి. పోలీస్ స్టేషన్ల పరిధిలో చట్ట వ్యతిరేక, అసాంఘిక కార్యక్రమాలపై ప్రత్యేక నిఘా (డ్రోన్ కెమెరాలతో) పెట్టి కట్టడి చేయాలి. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, బ్లాక్ స్పాట్స్ పై దృష్టి సారించాలన్నారు. జాతీయ రహదారుల్లోకి సర్వీస్ రోడ్లు కలుస్తున్న చోట ప్రమాదాల నివారణకు మిర్రర్లు, రిఫ్లెక్టర్లు, స్పీడ్ బ్రేకర్లు వంటివి ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అంతేకాకుండా రహదారులపైన వాహనాలను నిలపకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కేసులను అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి పూర్తిస్థాయిలో సాక్ష్యాధారాలు సేకరించాలని, ఆర్ఎఫ్ఎస్ఎల్, ఎఫ్ఎస్ఎల్ రిపోర్టులను త్వరితగతిన తెప్పించుకుని పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే ఎన్‌బిడబ్ల్యు వారెంట్స్ పెండింగ్ లేకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. పోలీస్ అధికారులు అందరూ తమ తమ పరిధిలో ఉన్న గ్రామాలను సందర్శించి అక్కడ ఎటువంటి శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. తరచూ నేరాలు జరిగే ప్రాంతాలను గుర్తించి అలాంటి ప్రాంతాలలో పోలీసు అధికారులు విజిబుల్ పోలీసింగ్ ను పెంచి ముందస్తుగానే నేరాలను నియంత్రించాలి. పిజిఆర్ఎస్ ద్వారా వచ్చిన ఫిర్యాదులకు ప్రథమ ప్రాధాన్యతతో పరిష్కరించాలన్నారు. సైబర్ నేరాల పై ప్రజలలో మరింత అవగాహనా సదస్సులు ఏర్పాటు చేసి స్కూల్, కాలేజీ విధ్యార్థులకు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి. ఎన్ఫోర్స్మెంట్ వర్క్ పై ప్రత్యేక దృష్టి కేంద్రకరించి, గంజాయి, డ్రగ్స్, గ్యాంబ్లింగ్, మట్కా శిబిరాల దాడులు చేసి తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతిరోజు వాహనాల తనిఖీలు, బీట్స్, పెట్రోలింగ్, చేపట్టాలని , బోర్డర్ చెక్ పోస్ట్ లలో నిత్యం నిఘా ఉంచి అక్రమరవాణా పై అడ్డుకట్ట వేయాలన్నారు. గ్రామాలను , వార్డులను సందర్శించి అక్కడ ఉన్న పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకొని ఎటువంటి తగాదాలు, మత ఘర్షణలు తదితర నేరాలపై పెప్పటికప్పుడు సమాచారం సేకరించి పై అధికారులకు తెలపాలి. గ్రామాలలో పల్లెనిద్ర చేయాలని అధికారులను ఆదేశించారు. రాత్రి వేళల్లో గస్తీ విధుల్లో అప్రమత్తంగా తిరుగుతూ పాత నేరస్థులను తనిఖీ చేసి నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో శక్తి యాప్ పై అవగాహన, శక్తి కాల్స్ పై వెంటనే స్పందించాలని అధికారులకు సూచించారు. కెమెరాలు, డ్రోన్‌ల యొక్క ప్రాముఖ్యతను ప్రజలకు తెలియచేసి (తరువాయి 4లో...)

## నూతన జాయింట్ కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలసిన మాజి ఎమ్మెల్యే అన్నా




**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జనవరి 28)**

మార్కాపురం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం నందు నూతనంగా మార్కాపురం జిల్లా ఏర్పాటు కావడంతో జాయింట్ కలెక్టర్ గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పులి శ్రీనివాసులుని గిద్దలూరు మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి అన్నా రాంబాబు శాలువ, బొకేతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో అన్నా వెంట రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ షంషీర్ ఆలీ బెగ్, మండల కన్వీనర్ చెంచిరెడ్డి,బీసీ సెల్ రాష్ట నాయకులు పిఎల్ పి యాదవ్, తర్లుబాడు మండల కన్వీనర్ మురారి వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షులు షేక్ సలీం, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రైతు కుటుంబం నుంచి ఎక్సైజ్ ఎస్ఐ ఉద్యోగంతో మెరిసి వీఆర్వో గుండారెడ్డి వెంకటరెడ్డి

**పంచాయతీ కార్యదర్శి షేక్ అబిద్ హుస్సేన్**

**రైతు కుటుంబం నుంచి ఎక్సైజ్ ఎస్ఐ ఉద్యోగంతో మెరిసి**

**(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, మార్కాపురం, జనవరి 28)**

ప్రభుత్వం 2023లో నోటిపికేషన్ ఇచ్చిన గ్రూఫ్-2 ఫలితాల్లో మార్కాపురంలోని గ్రామ స్థాయి ఉద్యోగులు ప్రతిభ కనపర్చారు. ఒక పక్క ఉద్యోగం చేసుకుంటూ మరొక పక్క ఉద్యోగ ప్రయత్నాల వేటలో తమ లక్ష్యం కోసం కృషి చేసి విజయం సాధించారు. ఎప్పటికైనా పైస్థాయి ఉద్యోగం సాధించాలనే తపనతో కష్టపడి చదివి అనుకున్న లక్ష్యం కోసం తమ జీవితానికి బంగారు బాటలు వేసుకున్నారు.

**రైతు కుటుంబం నుంచి ఎక్సైజ్ ఎస్ఐ ఉద్యోగంతో మెరిసి**

దోర్నాల మండలంలోని చిన్నదోర్నాల గ్రామానికి చెందిన గుండారెడ్డి వెంకటరెడ్డి పట్టణంలోని 21వ వార్డు సచివాలయంలో విధులు నిర్వహిస్తున్నాడు. రైతు కుటుంబం నుంచి వచ్చిన వెంకటరెడ్డి పాఠశాల స్థాయి నుంచే ఎప్పటికైనా ప్రభుత్వ ఉద్యోగం సాధించి ఉన్నతాధికారి కావాలనే తపనతో కష్టపడి చదివారు. గ్రామ స్థాయిలోనే ప్రాథమిక విద్యను ప్రభుత్వ పాఠశాలలోనే పూర్తి చేసి ఇంటర్, బీటెక్ పూర్తి చేశారు. అనంతరం ఉద్యోగ ప్రయత్నాల్లో తల్లిదండ్రులు పోత్సాహంతో 2014లో మొదటి ప్రయత్నంలోనే వీఆర్వో ( గ్రామ రెవెన్యూ అధికారి) పోస్టుకు ఎంపికైయ్యారు. వీఆర్వోతోనే తన ఉద్యోగం ఆగిపోకుడదని ఎప్పటికైనా ఉన్నతాధికారిగా ఉద్యోగం పొంది ప్రజలకు సేవ చేయలనే లక్ష్యంతో గ్రూప్-1,2కు శిక్షణ తీసుకుంటున్నాడు. 2016లో మొదటి సారి గ్రూప్-2 రాసిన సమయంలో రెండు మార్కుల తేడాతో ఉద్యోగం రాకుండా పోయింది. ఆ తర్వాత 2023 లో జరిగిన గ్రూప్-2కు ప్రత్యేక కార్యచరణను రూపొందించుకోని కష్టపడి చదవి రాసినట్లు చెప్పారు. ప్రభుత్వం మంగళవారం అర్ధరాత్రి విడుదల చేసిన గ్రూప్-2 ఫలితాల్లో ప్రొహిబిషన్- ఎక్సైజ్ ఎస్సైగా ఎంపిక అయ్యాడు. (తరువాయి 4లో...)

## ఇనిమెర్లలో పెరిగిన పసుపుదళం

**ఒకప్పుడు కాంగ్రెస్, వైసీపీ కంచుకోట**

**ఎమ్మెల్యే ఉగ్ర సమక్షంలో 300 కుటుంబాలు టీడీపీలో చేరిక**

**సర్పంచ్, ఉప సర్పంచ్, జీవన్‌రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలోకి వలసలు**



**(షణ్ముఖ వెలుగు, పామూరు, జనవరి 28)**

ఒకప్పుడు ఆ గ్రామం కాంగ్రెస్, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలకు కంచుకోట....2009లో ఇనిమెర్లలో అప్పటి కాంగ్రెస్ అభ్యర్థి, ప్రస్తుత ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డికి మూకుమ్మడిగా మద్ధతు పలికారు. 2019, 2024 ఎన్నికల్లో కూడా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ వచ్చింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఆధ్వర్యంలో కనిగిరి నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధికి ఆకర్షితులై ఇనిమెర్ల సర్పంచ్ సిద్ధమూర్తి లక్ష్మీ నారాయణరెడ్డి, ఉప సర్పంచ్ బొమ్మన శ్రీనివాసులు, యువ పారిశ్రామికవేత్త దుగ్గిరెడ్డి జీవన్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఎనిమిది మంది వార్డు సభ్యులు, 300 కుటుంబాలు వైసీపీ క్యాడర్ ఎమ్మెల్యే ఉగ్ర సమక్షంలో బుధవారం కనిగిరి పట్టణంలోని అమరావతి గ్రౌండ్ నందు టీడీపీ కండువాలు కప్పుకున్నారు. (తరువాయి 4లో...)

## సూర్యలంక నుంచి హైదరాబాద్ వరకు కారవాన్ కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్




**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జనవరి 28)**

పర్యాటక రంగం అభివృద్ధిలో భాగంగా సూర్యలంక నుంచి హైదరాబాద్ వరకు కారవాన్ ప్రభుత్వం ఏర్పాటు చేసిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తెలిపారు. స్వదేశీ దర్శన్ లో భాగంగా పర్యాటక రంగం అభివృద్ధిపై అధికారులతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. పర్యాటకులకు సరికొత్త అనుభూతిని కల్పించేలా కారవాన్ (ప్రయాణించే అన్ని సౌకర్యాలు ఉండే ఇంటిలాంటి వాహనం) లను ప్రభుత్వం ఏర్పాటు చేసిందని కలెక్టర్ చెప్పారు. రాష్ట్రంలోనే ప్రథమంగా నాలుగు ప్రాంతాలలో ఇలాంటి వాహనాలను ఏర్పాటు చేయగా, ఒక వాహనం బాపట్ల జిల్లా సూర్యలంక పర్యాటక ప్రాంతానికి కేటాయించడం సంతోషదాయకం అన్నారు. ఈ వాహనం సూర్యలంక నుంచి హైదరాబాదుకు వెళ్తుందన్నారు. రాష్ట్రంలోని పలు పర్యాటక ప్రాంతాలను సందర్శించేలా ప్రభుత్వం నూతన విధానానికి శ్రీకారం చుట్టిందన్నారు. పర్యాటకులకు కారవాన్ ద్వారా విశేష సేవలు అందించడానికి చర్యలు తీసుకుందన్నారు. పర్యాటక రంగం అభివృద్ధికి విస్తృతమైన చర్యలు తీసుకుందన్నారు. ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ ద్వారా వాటిని ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందన్నారు. ఏపీటీడీసీ పోర్టల్ ద్వారా వాహనాలను బుక్ చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు. కారవాన్ సేవలు అందుబాటులోకి వచ్చాయని, ఈ సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవచ్చన్నారు. ఇంటి వాతావరణంలాగానే ప్రత్యేకంగా రూపొందించిన వాహనం ద్వారా పర్యటించవచ్చన్నారు. ఆహారం కొరకు పర్యాటకుల కోరిక మేరకు మార్గమధ్యంలో ఎక్కడైనా హోటల్ ల వద్ద వాహనం నిలిపే అవకాశం ఉంటుంది. (తరువాయి 4లో...)

## ఏపీసీసీ వైఎస్ షర్మిలారెడ్డి త్వరలో ప్రకాశంజిల్లా పర్యటన





**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 28)**
ఏపీసీసీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి త్వరలో ప్రకాశం జిల్లా పర్యటనకు రానున్నట్లు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు షేక్ సైదా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని, గ్రామీణ పేదల పొట్టలు కొట్టే బిజెపి ప్రభుత్వం కొత్తగా తెచ్చిన వి.బి.రామ్.జి చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా జరుగుతున్న ఉద్యమంలో భాగంగా రాష్ట్ర వ్యాప్త పర్యటనలో భాగంగా ఫిబ్రవరి మొదటి వారంలో ఒంగోలు పార్లమెంట్ పరిధిలోని ప్రకాశం జిల్లా, మార్కాపురం నూతన జిల్లాలోని రెండు అసెంబ్లీ నియోజకవర్గాలల్లో గ్రామీణ ప్రాంతాలలో రచ్చబండ, మండల కేంద్రాలలో జరిగే బహిరంగ సభల్లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి పాల్గొంటారన్నారు. ఇప్పటి నుంచే జిల్లాలోని అన్ని నియోజకవర్గాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలారెడ్డి పర్యటన జయప్రదం చేసేందుకు సన్నద్ధం కావాలని ఆయన కోరారు.

## తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన సబ్ కలెక్టర్ హిమ వంశి



**(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జనవరి 28)**
స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం సబ్ కలెక్టర్ హేమ వంశి సందర్శించి రికార్డులు పరిశీలించారు. హిమవంశి మాట్లాడుతూ పిజిఆర్ఎస్ ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని తెలిపారు. కార్యాలయ సిబ్బందికి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం రిజిస్ట్రేషన్ రికార్డ్ రూములను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ వి పుల్లారావు, ఆర్ ఐ శివ, డిటి స్రవంతి, సర్వేరలు, వీఆర్వోలు సిబ్బంది పాల్గొన్నారు.

## ఉత్తమ తహశీల్దార్ ప్రభాకకరావుకు ఘన సన్మానం



**(షణ్ముఖ వెలుగు, చిన్నగంజాం, జనవరి 28)**
77వ గణతంత్ర దినోత్సవం సందర్భంగా బాపట్ల జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ నుండి జిల్లా ఉత్తమ తహశీల్దార్ గా అవార్డు పొందిన చిన్నగంజాం మండల తహసిల్దార్ జీవిగుంట ప్రభాకరరావును బుధవారం పలు ప్రజా సంఘాలు, పార్టీలకు చెందిన నాయకులు రెవెన్యూ కార్యాలయంలో ఆయనను కలిసి దుస్సాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. భవిష్యత్ లో ఉన్నత స్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ రాష్ట్ర కార్యదర్శి పలతోటి ఆంజనేయ ప్రసాద్, బహుజన సమాజ్వాది పార్టీ చీరాల నియోజకవర్గ ఇన్చార్జ్ చిట్టిమాల సంగీతరావు, జై భీమ్‌రావు భారత్ పార్టీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్చార్జ్ కాటుకూరు డేవిడ్, అంబేద్కర్ యువజన సంఘం ప్రకాశం జిల్లా అధ్యక్షుడు వాసుమల్లి నాగార్జున, కందుల కృష్ణ బాబు, దళిత మహాసభ చిన్నగంజాం మండల అధ్యక్షుడు మొలతోటి జయప్రకాష్, దళిత నాయకులు పులుగు సురేష్ దళిత, తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా దేవాదాయ శాఖ అధికారిగా ఎం నాగయ్య



**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జనవరి 28)**
జిల్లా దేవాదాయ శాఖ అధికారిగా ఎం నాగయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం మర్యాదపూర్వకంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

# రైతు కుటుంబం నుంచి ఎక్సైజ్ ఎస్ఐ ఉద్యోగంతో మెరిసి వీఆర్వో గుండారెడ్డి వెంకటరెడ్డి

దీంతో ఒక పక్క వీఆర్వోగా విధులు నిర్వహిస్తూనే మరొక పక్క ప్రజలకు సేవ చేయలనే లక్ష్యంతో గ్రూప్-1, 2కు శిక్షణ తీసుకుంటున్నాడు. 2016లో మొదటి సారి గ్రూప్-2 రాసిన సమయంలో రెండు మార్కుల తేడాతో ఉద్యోగం రాకుండాపోయింది. ఆ తర్వాత 2023లో జరిగిన గ్రూఫ్-2కు ప్రత్యేక కార్యచరణను రూపొందించుకోని కష్టపడి చదవి రాసినట్లు చెప్పారు. ప్రభుత్వం మంగళవారం అర్ధరాత్రి విడుదల చేసిన గ్రూప్-2 ఫలితాల్లో ప్రొహిబిషన్- ఎక్సైజ్ ఎస్సైగా ఎంపిక అయ్యాడు. దీంతో ఒక పక్క వీఆర్వోగా విధులు నిర్వహిస్తూనే మరొక పక్క గ్రూప్-2కు శిక్షణ తీసుకోని విజయం సాధించాడు. ఎప్పటికైనా గ్రూప్-1లో ఉద్యోగం సాధించాలనే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

**కష్టాల మెట్టు నుంచి విజయ పథంలోకి పంచాయతీ కార్యదర్శి**

తర్లుపాడుకు చెందిన షేక్ అబిద్ హుస్సేన్ కష్టాల మెట్టు నుంచి గ్రూప్-2 ఫలితాలతో విజయం పథంలోకి వచ్చారు. తండ్రి దాదాపీరా ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావంతో చిన్నతనం నుంచి తన తండ్రి మాదిరిగానే ఎలాగైనా ప్రభుత్వ ఉద్యోంగం సాధించాలనే పట్టుదలతో చదివాడు. పదో తరగతినేలో డివిజన్లోనే మొదటి స్థానంలో నిలిశాడు. అనంతరం ఇంటర్, ఇంజనీరింగ్లో చక్కటి ప్రతిభ కనపర్చాడు. అయితే తర్వాత ఉద్యోగం కోసం అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ విఫలం కావడంతో నిరుత్సాహం పడకుండా పోటీ పరీక్షలకు సిద్ధం అవుతూ వచ్చాడు. 2018లో ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్-3 ప్రకటించిన నోటిఫికేషన్లో 2020లో పంచాయతీ కార్యదర్శిగా పోస్టు సాధించాడు. ఆ తర్వాత గ్రూప్-2కు శిక్షణ తీసుకుంటున్నాడు. ఒక పక్క పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూనే మరొక పక్క గ్రూప్-2కు శిక్షణ తీసుకోని కష్టపడి ప్రభుత్వం ప్రకటించిన అసిస్టెంట్ సెక్షన్ అధికారిగా ఎంపికయ్యడు. ప్రజలకు సేవచేయాలనే తలంపుతో ఎప్పటికైనా గ్రూప్-1 పోస్టుకు ఎంపిక కావడానికి తన లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. మార్కాపురం మండలంలో పంచాయతీ కార్యదర్శి గ్రూప్-2 పోస్టుకు ఎంపిక కావడం పట్ల సహచర పంచాయతీ కార్యదర్శులు అభినందనలు తెలిపారు.

# ఇనిమెర్లలో పెరిగిన పసుపుదళం

మహిళలు కూడా పెద్ద సంఖ్యలో పార్టీలో చేరేందుకు తరలిరావడంతో ఒక పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా వైసీపీని వీడి టీడీపీలో చేరిన నాయకులను, కార్యకర్తలను ఉద్దేశించి ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ గత పదేళ్ళలో కనిగిరిలో



అభివృద్ధి ఆగిపోయిందన్నారు. కనిగిరి అభివృద్ధే అజండాగా పని చేస్తున్న తనకు అండగా నిలిచేందుకు టీడీపీలో చేరిన నాయకులు, కార్యకర్తలను ఆయన సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బొల్లా నరసింహారావు చౌదరి, పువ్వాడ వెంకటేశ్వర్లు, ఇనిమెర్ల గ్రామ పార్టీ అధ్యక్షుడు నల్లబోతుల వెంకటేశ్వర్లు, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు బోయళ్ళ నారాయణరెడ్డి, జయరామిరెడ్డి, తడికమల్ల సుబ్బారావు, ఇర్రి కోటిరెడ్డి, ప్రభాకర్ చౌదరి, గుంటుపల్లి శ్రీను, అమీర్ జాన్, సానికొమ్ము విజయభాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





## సూర్యలంక నుంచి హైదరాబాద్ వరకు కారవాన్

## కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

పర్యాటక శాఖకు చెందిన హోటళ్లలోనూ, పర్యాటకుల భద్రత నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాల ఆవరణం, పోలీస్ స్టేషన్ సమీపంలోనే వాహనాన్ని పార్కింగ్ చేస్తారన్నారు. పగలంతా వివిధ ప్రాంతాలను సందర్శించిన పర్యాటకులు రాత్రి వేళల్లో ఆ వాహనంలోనే సేద తీరేందుకు సౌలభ్యం ఉందన్నారు. కూర్చునే సీట్లే పడకగా మార్చుకుని ఆధునికీకరణ వసతులు ఉంటాయని, అందులోనే నిద్రపోయేలా వసతులు ఉంటాయన్నారు. కారవాన్ వాహనంలోనే టీవీ ఫ్రిజ్, వాష్ రూమ్ వంటి వసతులు ఉంటాయన్నారు. రెండు రోజుల ప్రయాణానికి 12 సీట్లకు గాను రూ. 85వేలు ఖర్చు అవుతుందని ఆయన వివరించారు. ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. పర్యాటకుల కొరకు హౌస్ బోట్ లు త్వరగా వినియోగంలోకి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు. పర్యాటకల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో పేరలి కెనాల్ అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో కనువిందు చేసే దృశ్యాలతో బోటు ప్రయాణం సాగించడానికి త్వర త్వరగా పనులు చేపట్టాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా పర్యాటక శాఖ అధికారి అలిఅస్గర్, ఆర్డీవో పి గ్లోరియా, ప్రాజెక్ట్ మేనేజర్, అనుబంధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# దొంగతనాల కట్టడితో పాటు చోరీ సొత్తు రికవరీపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఏర్పాటు చేసే విధంగా చూడాలని, ఫ్రెండ్లీ పోలీసింగ్ విధానాన్ని పాటిస్తూ పోలీస్ స్టేషన్ కు వచ్చే ఫిర్యాదుదారులతో స్నేహపూర్వకంగా మెలిగి వారి ఫిర్యాదులను స్వీకరించి జవాబుదారీగా ఉండాలని, మహిళలు, చిన్నారుల సంబంధిత ఫిర్యాదులపై తక్షణమే స్పదించాలని, పోలీస్ శాఖపై నమ్మకం పెంపొందించేలా సేవలు అందించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాలలో గుర్తించి ప్రజల సహకారంతో వాటిని శుభ్రం చేయాలని ఆదేశించారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవిస్తే అలాంటి వారిపై కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఒంగోలు డిఎస్పీ ఆర్ శ్రీనివాసరావు, దర్శి డిఎస్పి లక్ష్మీనారాయణ, డిసిఆర్బి సిఐ దేవ ప్రభాకర్, సబ్ డివిజన్ సిఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

# అంబేద్కరిజం క్యాలండర్ ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ రూపకర్త నీలంకు అభినందనలు



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 28)**
దళిత నేత నీలం నాగేంద్ర రూపొందించిన అంబేద్కరిజం కాలెండర్ ను జిల్లా కలెక్టర్ రాజా బాబు బుధవారం తన ఛాంబర్ లో ఆవిష్కరించారు. అంబేద్కరిజం కాలెండర్ ప్రత్యేకత గురించి జిల్లా కలెక్టర్ రాజా బాబుకు తేదీలు వాటి ప్రాముఖ్యత నెలలువారీగా వివరించారు. జనవరి ఒకటిన మహర్ సైనికుల విజయోచ్చావ దినం, అలాగే జనవరి మూడునా భారతీయ మొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిభాయ్ పూలె జయంతి, జనవరి 13 విరసం నేత కళ్యాణ్ రావు అంటరానివాసంతం ఆవిష్కరణ, జనవరి 26 అంబేద్కర్ రిపబ్లిక్ డే అని కలెక్టర్ కు వివరించారు. ఫిబ్రవరి నెలలో 14 తేదీన ఆంధ్రప్రదేశ్ ఏకైక దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జయంతి, మార్చ్ 15 న బహుజన రాజ్యాధికార దాసినికుడు అంబేద్కర్ కలలపంట కాన్షిరాం జయంతి 16 వ తేదీ మహాద్ చెరువు పోరాటం, ఏప్రిల్ 11న మహాత్మ జ్యోతి రావ్ ఫూలే జయంతి, ఏప్రిల్ 17 న పీపుల్స్ వార్ వ్యవస్థాపకులు విప్లవ మూర్తి సత్యమూర్తి అలియాస్ శివసాగర్ వర్ధంతి తేదీల ప్రాముఖ్యత విశిష్టతల గురించి కలెక్టర్ కు వివరించారు. మే 27 న అంబేద్కర్ సతీమణి రామబాయ్ వర్ధంతి, జూన్ 10వ తేదీ మానవహక్కుల యోధుడు బాలాగోపాల్ జయింతి, జూన్ 12 న లక్ష్మి పేట దళితుల మరణకాండ, మరియు జూన్ 29 అంబేద్కర్ గురువు అయినా కబీర్ జయంతి, జూలై 17 భారతదేశ దళిత ఆత్మగౌరవ పోరాట పోలికేక కరెంచేడు మారానకాండ సంఘటన గాయలను, గేయాలను కుడా కలెక్టర్ కు నీలం వివరించారు. అలాగే ఆగస్టు 6 న దళితులకు వజ్రయుదుమైన ఎస్సీ, ఎస్టీ యాక్ట్ ను తెచ్చిన చుండూరు నరమేదాం రక్తగీతం గురించి సోదాహరణంగా కలెక్టర్ కు నీలం తెలిపారు. ఆగస్టు 17 నా కమ్యూనల్ అవార్డు ప్రకటన 26 తేదీన నారాయణ గురు జయంతి వాటి నేపథ్యం గురించి తెలిపారు. సెప్టెంబర్ లో 28 మహాకవి గుర్రం జాషువా, 29 దళిత తిరుగుబాటు పైడి తేరేష్ బాబు మరణం గురించి తెలిపారు, అక్టోబర్ 14 న అంబేద్కర్ భౌద్ధ ధర్మ స్వీకారం గురించి, నవంబర్ 30 తేదీన బ్రిటిష్ కౌన్సిల్ లో అంబేద్కర్ కార్మిక శాఖ మంత్రిగా నియమించిన వైనాన్ని గూర్చి సవివరంగా తెలిపారు. డిశంబర్ 22 తారీఖున దళిత సమైక్యవాది పీవి రావ్ వర్ధంతి అలాగే డిశంబర్ 25 వేలాద్యులుగా కొనసాగుతున్న మనుస్మృతిని అంటరాని కులాల సూరీడు అంబేద్కర్ దహనం చేసిన రోజు అని చారిత్రక ఆధారాలతో దళిత జాతి విముక్తి పోరాటల గాధలు కలెక్టర్ కు నీలం వివరించారు. దళిత ఉద్యమ సజీవ చరిత్ర ను కాలగమనిగ మార్చిన దళిత నేత నీలం నాగేంద్ర ను ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజా బాబు అభినందించారు. ఈ కార్యక్రమం లో దళిత సంఘాల ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ పత్రా బంగారం, మాల మహానాడు జిల్లా అధ్యక్షులు దార అంజయ్య, ఏలూరి శ్రీనివాసరావు, దేవరపల్లి రవణయ్యా, మేడికొండ మురళి, దళిత కవి చప్పిడి కోటేశ్వరరావు, చేబ్రోలు సృజన్ రాజ్, న్యాయవాది పాల్గొన్నారు.

## మంచినీటి సరఫరాలో అంతరాయం



**(షణ్ముఖ వెలుగు, ఒంగోలు, జనవరి 28)**
ఒంగోలు నగరపాలక సంస్థ పరిధిలోని రంగారాయుడు చెరువు వద్ద రోడ్డు విస్తరణ కార్యక్రమం చేపట్టుచున్నందున, అక్కడున్న మంచినీటి పైపులైన్లను మార్చవలసియున్నది. 03.02.2026 నుండి 05.02.2026 వరకు అనగా మూడు రోజుల పాటు పట్టణం నందలి ఈ దిగువ తెలిపిన ప్రాంతముల వారికి మంచినీటి సరఫరాలో అంతరాయం ఏర్పడునని బుధవారం బుధవారం ఒంగోలు నగరపాలక కమిషనర్ కోడూరు వెంకటేశ్వరరావు తెలియచేశారు. గాంధీ రోడ్డు, గానుగ పాలెం, దక్షిణం బజారు, ప్రత్తివారి వీధి, ఈమన పాలెం, జక్రయ్య నగర్, ఎన్జీవో హోమ్, సీఆర్పీ క్వార్టర్స్ ఏరియా, గొడుగు పాలెం ఏరియా, రాజపానగల్ రోడ్డు ఏరియా, కేశవ స్వామి పేట, దేవుడు చెరువు, భీమరాజు వారి వీధి, కోట వీధి, వంట కాలనీ, బండ్లమిట్ట ఏరియా, లంబాడి డొంక, బాలాజిరావు పేట, గోపాల్ నగర్, కమ్మ పాలెం, తూర్పు క్రిస్టియన్ పాలెం, ఇందుర్తి నగర్, నీలాయ పాలెం, ఇస్లాం పేట, క్లౌ పేట, లారీల కుంట, కర్నూల్ రోడ్డు, శ్రీనగర్ కాలనీ 4 లైన్లు, మారుతి నగర్ 4 లైన్లు, శ్రీనివాస కాలనీ, ఆంధ్రకేసరి కాలనీ, శ్రీరామ కాలనీ, సమతా నగర్, సుజాత నగర్, రెవిన్యూ కాలనీ, వెంకటేశ్వరకాలనీలు. పై తెలిపిన ప్రాంతములలోని ప్రజలందరూ పై విషయాన్ని గమనించి పై తెలిపిన తేదీల కన్న ముందు సరఫరా చేయు మంచినీటిని సద్వినియోగపరచుకొని, పొదుపుగా వాడుకొని నగరపాలక సంస్థ వారికి సహకరించవలసినదిగా కమిషనర్ ప్రకటనలో తెలిపారు.

# వినుకొండకు 240 కోట్లతో శాశ్వత త్రాగునీటి పథకం

**ప్రతి ఇంటికి త్రాగునీరు ఇవ్వటమే లక్ష్యం**
**2027 నాటికి పట్టణ త్రాగునీటి పథకం పూర్తి**
**ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు**






**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జనవరి 28)**
పట్టణానికి రూ.240 కోట్లతో శాశ్వతంగా తాగునీటి సమస్యను పరిష్కరించనున్నట్లు ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు తెలిపారు. రూ.30 కోట్లతో అమృత్ స్కీం ద్వారా జరగనున్న పనులను పబ్లిక్ హెల్త్, మునిసిపల్, రెవిన్యూ వివిధ శాఖల అధికారులతో బుధవారం చీఫ్ విప్ జీవి పరిశీలించారు. వాటర్ ట్యాంకులకు నీటి సరఫరా లో భాగంగా వెల్లటూరు వద్ద ఎన్ఎస్పి డీప్ కట్, దొండపాడు చెరువు, పట్టణానికి త్రాగునీరు సరఫరా చేసే సింగర చెరువులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ జీవి ఆంజనేయులు మాట్లాడుతూ అమృత్ స్కీం ద్వారా రూ.30 కోట్లతో వినుకొండ పట్టణానికి 6 వాటర్ ట్యాంకులు, పైప్ లైన్ నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. అలాగే యుఐడిఎఫ్ పథకం ద్వారా వినకొండ పట్ట శాశ్వత త్రాగునీటి పరిష్కారానికి రూ.210 కోట్లు నిధులు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ పథకం ద్వారా వినుకొండ పట్టణంలో 20 వేల ఇళ్లకు పైగా కుళాయి కనెక్షన్లు ఇచ్చి ప్రతిరోజు రెండో పూటలా స్వచ్ఛమైన త్రాగునీరు సరఫరా చేయడం జరుగుతుందన్నారు. త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభించడం జరుగుతుందని వివరించారు. స్వచ్ఛమైన త్రాగునీరు, ప్రజా ఆరోగ్య రక్షణ లక్ష్యంగా కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పనిచేస్తున్నాయన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు నేత్రత్వంలో రాష్ట్రవ్యాప్తంగా 24 వేల కోట్లకు పైగా నిధులతో త్రాగునీటి పథకం పూర్తి చేసి ప్రతి ఇంటికి త్రాగునీరు ఇచ్చేందుకు పనిచేస్తుందన్నారు. యుఐడిఎఫ్ ద్వారా రాష్ట్రవ్యాప్తంగా పట్టణ ప్రాంతాల్లో రూ.11020 కోట్లతో, జల జీవన్ పథకం ద్వారా రూ.13 వేల కోట్లతో గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటికి కుళాయి కనెక్షన్ ఇచ్చి స్వచ్ఛమైన త్రాగునీటిని ప్రభుత్వం సరఫరా చేయనుందన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో త్రాగునీటి పథకాలను నిర్లక్ష్యం చేసి ప్రజలతో చెరగాటమాడారన్నారు. నిధులు ఉన్నప్పటికీ త్రాగునీటి పథకాలు పూర్తి చేయలేని అసమర్థులు నాటి వైసిపి పాలకులని ఎద్దేవా చేశారు. తాగునీటి పథకాలను నిర్వీర్యం చేసి జె బ్రాండ్లతో లక్షల కోట్లు అక్రమార్చన పొంది ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని విమర్శించారు. వినుకొండ పట్టణంలో చేపట్టాల్సిన వాటర్ ట్యాంకులు, పైప్ లైన్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని చీఫ్ విప్ జీవి అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ప్రజారోగ్య శాఖ, మునిసిపల్, రెవిన్యూ, వివిధ శాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## కరేడు గ్రామంలో పొలం పిలుస్తోంది

**మండల వ్యవసాయ అధికారి డి విజయ్ కుమార్**





**(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జనవరి 28)**
మండలంలోని కరేడు గ్రామంలో మండల వ్యవసాయ అధికారి డి విజయ్ కుమార్ ఆధ్వర్యంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కరేడు గ్రామ పరిధిలోని వరి, వేరుశనగ పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడటం జరిగింది. వరిలో కాండంతొలుచు మరియు ఆకుముడుత పురుగు సస్యరక్షణ లో భాగంగా కార్బోఫ్యూరాన్ 3+ గుళికలు ఎకరాకు 10 ఎస్త్ర లు వాడాలని సూచించారు. ప్రస్తుతం వరి పాలు పోసుకొనే దశలో ఎరువుకు సంబంధించి యూరియా 70 కేజీలు, పోటాష్ 20కేజీలు వాడాలని చెప్పారు. వేరుశనగ పంటకు సంబంధించి పూత దశలో ఉన్నది కాబట్టి ఊడలు దిగి విత్తనం నాణ్యం మరియు నూనెశాతం పెరుగుటకు జిప్సమ్ ఎకరాకు 200 కేజీ లు వాడాలని రైతులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీఏఏ కిషోర్, వీహెచ్‌హెచ్ మసూద్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## రహదారుల నిర్మాణానికి సమగ్ర ప్రణాళికలు




**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జనవరి 28)**
పర్యాటక రంగం మాస్టర్ ప్లాన్‌లో ఉన్న రహదారుల నిర్మాణానికి సమగ్ర ప్రణాళిలు, అంచనాలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. జాతీయ రహదారులు, ఆర్ అండ్ బి రహదారుల నిర్మాణ పనులపై సంబంధితశాఖల అధికారులతో బుధవారం స్థానిక కలెక్టరేట్ నుంచి హైబ్రిడ్ మోడ్ లో సమావేశం నిర్వహించారు. రహదారులు బాగుంటే సుఖమయ ప్రయాణం సాగుతుందని కలెక్టర్ చెప్పారు. జిల్లాలో నిర్మిస్తున్న జాతీయ రహదారులన్నీ వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం తర్వాత గతిన పూర్తి చేయాలన్నారు. గుంతల రహిత రహదారణ నిర్మాణం లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఆ దిశగా రహదారులను సిద్ధం చేయాలన్నారు. జిల్లాకు కొత్తగా మంజూరైన రహదారులు నాణ్యతతో నిర్మించాలన్నారు. రహదారులకు అత్యవసర మరమ్మత్తులపై ప్రణాళికలు రూపొందించాలన్నారు. సాస్కి ద్వారా మంజూరైన రహదారుల నిర్మాణ పనులు వేగంగా పూర్తి చేయాలన్నారు. గ్రామీణ ప్రాంత ఆరోగ్య కేంద్రాలకు అవసరమైన స్థలాలు త్వరగా గుర్తించి, నిర్మాణ పనులు రెండు వారాలలో ప్రారంభించాలని కలెక్టర్ చెప్పారు. 210 కేంద్రాలలో 31 కేంద్రాలకు స్థలాలు లేవన్నారు. సాంకేతిక సమస్యలను పరిష్కరించి స్థలాల కేటాయింపులు జరగాలన్నారు. ఆక్వా పార్కు నిర్మాణ పనులు మే నెలలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆటిజం కేంద్రాల నిర్మాణం, భవిత కేంద్రాల అభివృద్ధి పనులు వేగంగా చేపట్టాలన్నారు. 23 ఎస్సీ, ఎస్టీ సంక్షేమశాఖల వసతి గృహాల నిర్మాణ పనులు, మరమ్మతు పనులు వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పీఎం శ్రీ పథకం కింద మంజూరైన పనులు పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆర్ అండ్ బి ఇంచార్జి ఈఇ నలిని, డిఈలు అరుణకుమారి, రాజేష్, ఎస్సీ, ఎస్టీ, బీసీ సాధికారత అధికారులు సత్యనారాయణ, అబ్బులు, శివలీల, మత్స్యశాఖ జెడి గాలి దేముడు, తదితర శాఖల తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పొలం పిలుస్తుంది



**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జనవరి 28)**
మండలంలోని మాదాలవారి పాలెం, ఓబులక్కపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మండల వ్యసాయ అధికారి శ్రీనివాసులు కంది పంటను పరిశీలించారు. కంది పంటను కోసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి మరియు నిల్వ చేసేటప్పుడు జాగ్రత్త తీసుకోవాలని తెలిపారు. కంది పంట కాయలు పూర్తిగా ఎండిన తర్వాతనే కోసి కాయల నుండి గింజలు వేరు చేసి నిల్వ చేయాలని పురుగులు ఆశించకుండా ఉండేందుకు బాగా ఎండబెట్టి బూడిద గాని, వేపాకులు గాని కలపాలని తెలిపారు. ఈ రబీ సీజన్లో ఈ పంట యాప్ నవీకరణ ద్వారా రైతులకు ఆన్లైన్ ద్వారా పంట నమోదు వివరాలు పరిశీలతో పాటు ఫిర్యాదులు చేసే అవకాశం ఇచ్చినట్లు తెలిపారు. రైతులకు పంట నమోదు వివరాలు నమోదు ముందు నమోదు రోజు నమోదు తర్వాత ధ్రువీకరణకు సమాచారం ఎస్ఎంఎస్ ద్వారా చేరవేయడం జరుగుతుందన్నారు. రైతులు వారి స్మార్ట్ ఫోన్ లోనే ప్లే స్టోర్ ద్వారా పూబరైజేషన్ ఆఫ్ కిసాన్ డ్రోన్స్ అనే యాప్ ద్వారా లేదా క్యూ ఆర్ కోడ్ ద్వారా డ్రోన్స్ ను బుకింగ్ చేసుకొని అద్దె ప్రాథపదికన ఉపయోగ ఇంచ వచ్చన్నారు. దీని ద్వారా రైతులు వారి ప్రాంతంలోనే అద్దకు డ్రోన్ ను సేవలు సులభంగా పొందవచ్చని తెలిపారు. ఈ యాప్ లో డ్రోన్స్ ఎవరో అందించేవారు వారి పేర్లు నమోదు చేపడతాయన్నారు. తద్వారా రైతులు సులభంగా డ్రోన్స్ పై వినియోగం చేసుకోవచ్చన్నారు. అనంతరం గ్రామ రైతులకు ఫార్మర్ రిజిస్ట్రే పోర్టల్ లో రైతులు రిజిస్ట్రేషన్ చేయడం జరిగింది. వ్యవసాయానికి సంబంధించిన ఎటువంటి రాయితులు గాని లేదా పథకాలు గాని అర్హత పొందాలంటే కచ్చితంగా ప్రతి రైతు ఏపీఫ్ఆర్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకొని యూనిక్ ఐడి నంబర్ పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామా రైతులు పాల్గొన్నారు.

## పిల్లలందరి కోసం రుచికరమైన విందు





**(షణ్ముఖ వెలుగు, పొదిలి, జనవరి 28)**
స్నేహ చికెన్ మేనేజింగ్ డైరెక్టర్ దండి రామ్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా బుధవారం టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వరికుంట్ల అనిల్ (పండు) పొదిలిలోని భవిత సెంటర్‌లో పిల్లలందరి కోసం రుచికరమైన విందు, కేక్ కటింగ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. వరికుంట్ల అనిల్ కుమార్ ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు స్వయంగా ఆహారం వడ్డించారు. వారితో కలిసి భోజనం చేశారు. పిల్లలు చాలా సంతోషంగా అనిల్‌తో సమయం గడిపారు. యూత్ ఐకాన్ వరికుంట్ల నిరంజన్, ఐటిడిపి నాయకులు శ్రీకాంత్ గిద్దలూరు, తదితరులు పాల్గొన్నారు.


# కంభం చెరువులో గల్లంతైన వ్యక్తి కోసం పోలీసుల విస్తృత గాలింపు

**గాలింపు చర్యల్లో పాల్గొన్న ఫైర్ స్టేషన్ సిబ్బంది**

**(షణ్ముఖ వెలుగు, కంభం, జనవరి 28)**
కంభం ఈ నెల 25న కంభం చెరువులో ఈతకు వెళ్లి గల్లంతైన కాటమాల అశోక్ కుమార్ ని గుర్తించేందుకు కంభం సీఐ మల్లికార్జున, ఎస్సై శివ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కూడా విస్తృత గాలింపు చర్యలు చేపట్టారు. ఈ గాలింపు కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ సిబ్బంది, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ బృందం, స్థానిక మత్స్యకార సంఘ సభ్యులు సమన్వయంతో పాల్గొన్నారు. ఆధునిక పద్ధతులు, అనుభవజ్ఞుల సహకారంతో చెరువు పరిసర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. గల్లంతైన వ్యక్తి ఆచూకీ కోసం అధికారులు ఎలాంటి లోపం లేకుండా శ్రమిస్తూ, సహాయక చర్యలను కొనసాగిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని అధికారులు సూచించారు. నాలుగు రోజులుగా చెరువు అంతటా గాలించినా అశోక్ కుమార్ ఆచూకీ తెలియలేదు. నాలుగు రోజులక్రితం కంభం చెరువులో ఈతకు వెళ్లి మునిగి పోతుండగా అక్కడ ఉన్న కొందరు పర్యాటకులు వీడియో తీసి పోలీసులకు అందించారు.ఎక్కువ దూరం ఉండటంతో కాపాడలేక పోయామని పర్యాటకులు పోలీసులకు తెలిపారు. అప్పటి నుండి అశోక్ కుమార్ నీటిలో మునిగి చనిపోయి ఉంటాడని మృతదేహం కోసం పోలీసులు గాలిస్తున్నారు.


## ఉత్తమ ఉద్యోగులకు ఘన సన్మానం



**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, జనవరి 28)**
మార్కాపురం జిల్లా కేంద్రంలోని ఎస్‌వికెపి డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగిన 77వ గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఆర్అండ్ బి మార్కాపురం జిల్లా అధ్యక్షులు మండ్ల వెంకటసుబ్బయ్య, యర్రగొండపాలెం తహసిల్దార్ కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ తుడిమెళ్ళ ఏసు రత్నం, యర్రగొండపాలెం వీఆర్‌ఏ కొర్రపోలు బుజ్జిలు ఉత్తమ ఉద్యోగుల పురస్కార అవార్డులను అందుకున్నారు. వారిని అభినందిస్తూ ఏపీజెఎసి రాష్ట్ర వర్క్ చార్జెడ్ వైస్ ప్రెసిడెంట్ ఆలేటి నాగయ్య ఆధ్వర్యంలో ఘనంగా సన్మానం ఏర్పాటు చేశారు.

## రోడ్డు ప్రమాదాల నివారణ పై అవగాహన




**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, జనవరి 28)**
జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు బుధవారం యర్రగొండపాలెం సీఐ కె అజయ్ కుమార్ రోడ్డు భద్రతా నియమాలపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. ముఖ్యమైన కూడలి, బ్లాక్ స్పాట్స్, యాక్సిడెంట్లు జరిగే ఏరియాల వద్ద ప్రజలకు, వాహనచోదకులకు అవగాహన ఫ్లెక్సీలు ఏర్పాటుచేయటం, జాతీయ రహదారిపై రోడ్డు భద్రత, రక్షణ, అతివేగం వంటి విషయాలపై సంకేత బోర్డులతో అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలని తెలిపారు. హెల్మెట్ లేకుండా ప్రయాణం చేస్తే ప్రమాదాల్లో తలకు తీవ్రగాయాలై మృతి చెందిన సంఘటనలు ఉన్నాయని తప్పనిసరిగా హెల్మెట్ ధరించి వాహనం నడపాలని సూచించారు. రోడ్డు భద్రత నిబంధనలపై ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, ఎక్కువ స్పీడ్ వెళ్లరాదని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం బ్రేక్ ఇన్స్పెక్టర్ మాధవరావు, ఎస్ఐ పి చౌడయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# వెంకటేశ్వర మందిరం గోశాలకు రూ.60 వేలు విలువచేసే మోటార్

## స్విచ్ నొక్కి మోటర్‌ను ప్రారంభం
## పలువురిని సత్కరించిన గోశాల యజమాని శ్రీనువాసులు









**(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జనవరి 28)**

కడప జిల్లా బద్వేల్ రెవెన్యూ డివిజనల్ బ్రహ్మంగారి మఠం ఆవరణంలోని శ్రీ వెంకటేశ్వర మందిరం గోశాలకు పలువురు దాతల సహాయ సహకారాలతో రూ.60 వేలు విలువచేసే టెక్సమో కంపెనీ మోటార్ ను గోషాలకు వితరణ చేయడం జరిగింది. బుధవారం ఉదయం బ్రహ్మం గారి మఠంలోని వెంకటేశ్వర మందిరం గోశాలలో టెక్సమో కంపెనీ డీలర్ కత్తెర పల్లె శివరామరెడ్డి ఆధ్వర్యంలో అక్కడ ఏర్పాటు చేసిన నూతన మోటర్‌ను వార్త జర్నలిస్ట్ వెంకటరమణ, మాజీ ఆర్యవైశ్య వర్ధక సంఘం అధ్యక్షులు కే,వి సుబ్బారావు, జొన్నలగడ్డ సుధాకర్, అవొపా సెక్రటరీ సి.వి నాగేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభించారు. ముందుగా మోటార్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది. బద్వేల్ పట్టణంలోని పలువురు దాతల సహాయ సహకారాలతో దాదాపు 60, వేల రూపాయలు విలువచేసే మోటర్ స్టార్టర్, అక్కడ అవసరమైన 300 మీటర్ల పైగా విద్యుత్తు వైరు స్టార్టర్ బాక్సులతో సహా కంపెనీకి సంబంధించిన పరికరాలతో తయారుచేసి ఏర్పాటు చేయడం జరిగింది. ముఖ్యంగా అక్కడ గోశాలలో దాదాపు 20 గోవులు ఉన్నాయి. కొండ ప్రాంతంలో నీటి సమస్య రావడంతో గోవులకు నీటి కొరత ఉండడం చాలా ఇబ్బందికరంగా ఉందని గూశాల యజమాని శ్రీనివాసులు పేర్కొన్నారు. గత రెండు నెలల నుండి వార్త జాతీయ దినపత్రిక బద్వేల్ అర్బన్ రిపోర్టర్ వల్లంకొండు వెంకటరమణను గోశాలకు మోటర్ అవసరం ఉంది. గోవులు నీళ్లు తాగడానికి ఇబ్బందిగా ఉందని తెలియజేసిన వెంటనే రమణకు బద్వేల్ ప్రాంతంలో ఉన్నటువంటి పలువురు దాతల సహాయ, సహకారాలతో విరాళాలు సేకరించి నూతన మోటార్‌ను గోశాలకు ఏర్పాటు చేయడం పట్ల గోశాల నిర్వాహకులు మీసాల శ్రీనివాసులు మోటార్‌కు సహకరించిన దాతలు అందరికీ కూడా పేరు పేరున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం గోశాల వద్దకు విచ్చేసిన పలువురిని సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నిరంతరాయంగా గోవులకు సేవ చేస్తున్న శ్రీనివాసులు దంపతులను వార్త జర్నలిస్ట్ రమణ, పలువురు వారిరువురిని శాలువాలతో సత్కరించి వార్త డైరీ, వార్త నూతన క్యాలెండర్ అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కొలిశెట్టి సుబ్రహ్మణ్యంతో పాటు పలువురు పాల్గొన్నారు.

## వైసీపీని వీడి 70 కుటుంబాలు టిడిపిలో చేరిక





**(షణ్ముఖ వెలుగు, వినుకొండ, జనవరి 28)**

వినుకొండ నియోజకవర్గం లోని శావల్యాపురం మండలం పొట్లూరు గ్రామం వైసీపీకి చెందిన 70 కుటుంబాలు బుధవారం టిడిపిలో చేరారు. టిడిపి గ్రామ కమిటీ నాయకుల ఆధ్వర్యంలో వైసీపీకి చెందిన చెరుకూరి శ్రీనివాసరావు, ఆదినారాయణ, ప్రసాద్, జగ్గయ్య, రామస్వామి, చంద్రమౌళి, వెంకటేశ్వర్లు, రోశయ్య, తమ్మిశెట్టి అంకారావు, బండారు అంజయ్య, పొట్లూరి వీరాంజి, పొట్లూరి రాముడు, పొట్లూరి సూరిబాబు, లతోపాటు 70 కుటుంబాలు ప్రభుత్వ చీఫ్ విప్, సీనియర్ శాసనసభ్యులు జీవీ ఆంజనేయులు సమక్షంలో పార్టీలో చేరగా టిడిపి జెండాలు కప్పి ఆయన సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా చీఫ్ విప్ జీవి మాట్లాడుతూ అందరూ సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. సీఎం చంద్రబాబు నాయుడు పాలనలో గ్రామాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. గ్రామంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రతి ఒక్కరు పాటుపడాలని సూచించారు. గ్రామ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని, కూటమి ప్రభుత్వంలో పంచాయతీని మరింత అభివృద్ధి చేయాలన్న ఉద్దేశంతో తామంతా టిడిపిలో చేరామన్నారు. కార్యక్రమంలో పొట్లూరు టిడిపి గ్రామ కమిటీ నాయకులతో పాటు మండల నాయకులు పాల్గొన్నారు.

## మాజీ మంత్రి జోగి రమేష్ ను కలిసిన యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి



**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, జనవరి 28)**

నకిలీ మద్యం అక్రమ కేసులో అరెస్టు అయ్యి ఇటీవలే బెయిల్ మీద మాజీ మంత్రి జోగి రమేష్ ఇంటికి చేరుకున్నారు. బుధవారం మాజీ మంత్రి జోగి రమేష్‌ను వారి నివాసంలో యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

## ఇండోర్ స్టేడియం ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్







**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జనవరి 28)**

యువత క్రీడల్లో రాణించేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని వసతులు కల్పిస్తుందని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. బుధవారం రాత్రి బాపట్ల జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియాన్ని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని వసతులు కల్పించేందుకు కట్టుబడి ఉందని తెలిపారు. క్రీడాకారులు క్రమశిక్షణతో సాధన చేస్తూ జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. అలాగే క్రీడా వసతుల మెరుగుదల కోసం సంబంధిత అధికారులకు అవసరమైన సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా స్టేడియంలో ఉన్న క్రీడా వసతులు, మౌలిక సదుపాయాల నిర్వహణ, శిక్షణ కార్యక్రమాల అమలు తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. స్టేడియంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులతో కలెక్టర్ గారు నేరుగా మాట్లాడి వారి అనుభవాలు, అవసరాలు, ఎదురవుతున్న సమస్యలను క్రీడాకారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ అధికారి శ్రీనివాసరావు, కోచ్‌లు,క్రీడాకారులు, స్టేడియం సిబ్బంది తదితరులు ఉన్నారు.

# వీర్ పరివార్ సహాయత యోజన పథకంపై అవగాహన

**(షణ్ముఖ వెలుగు, కనిగిరి టౌన్, జనవరి 28)**



మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జడ్జి బి.రూప శ్రీ నేతృత్వంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బుధవారం కనిగిరి పట్టణంలోని కాస్మో పొలిటిన్ క్లబ్ నందు మాజీ సైనిక ఉద్యోగులకు వీర్ పరివార్ సహాయత యోజన పథకంపై అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ చైర్మన్, న్యాయవాది షేక్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ జాతీయ న్యాయ సేవల అథారిటీ 'వీర్ పరివార్ సహాయత యోజన 2025' అనే పథకాన్ని ప్రారంభించిందని ఇది రక్షణ సిబ్బంది,మాజీ సైనికలు వారి కుటుంబాలకు న్యాయ సహాయాన్ని బలోపేతం చేయడానికి ఉద్దేశించబడిందని అన్నారు.మాజీ సైనికులకు న్యాయ సేవాధికార సంస్థ చేస్తున్న ఉచిత సేవాలు గురించి వివరించారు. న్యాయవాది పాశం పిచ్చయ్య మాట్లాడుతూ కుటుంబ ఆస్తి, భూమి వివాదాలు లేదా గృహ సమస్యలకు సంబంధించిన చట్టపరమైన విషయాలలో కోర్టుకు హాజరు కావడం లేదా అనుసరించడం తరచుగా కష్టంగా భావించే మారుమూల ప్రాంతాలలో నియమించబడిన సిబ్బందికి ఈ పథకం ప్రత్యేకంగా వర్తిస్తుందని అన్నారు.న్యాయ సేవల అథారిటీకి చెందిన ప్యానెల్ న్యాయవాదులు, పారాలీగల్ వాలంటీర్లు సైనికులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తారని తెలిపారు. టోల్ ఫ్రీ నెంబర్ 15100,ఉచిత ఆన్ లైన్ న్యాయ సేవలపై అవగాహన కలిగించారు.అనంతరం ఉచిత న్యాయ సహాయం ప్రచారంలో భాగంగా పోస్టర్ ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ మంద్రు రమేష్ బాబు మాజీ సైనికులు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

# ఎస్‌టియు దశల వారి పోరాటాన్ని ఉద్యోగ, ఉపాధ్యాయులు విజయవంతం చేయాలి

## జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ దేశా నాయక్ పిలుపు




**(షణ్ముఖ వెలుగు, యర్రగొండపాలెం, జనవరి 28)**

రాష్ట్రోపాధ్యాయ సంఘం ఎర్రగొండపాలెం మండల శాఖ ఆధ్వర్యంలో స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ఎస్టీయూ దశల వారి పోరాట కార్యక్రమం పాంప్లెట్ ను ఆవిష్కరించారు. మేని ఫేస్టోలో ఇచ్చిన హామీలను అమలు పరచాలని ప్రభుత్వానికి డిమాండ్ చేయడం జరిగింది ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన నాలుగు డిఏలు ప్రకటించి, 12వ వేతన సంఘాన్ని ఏర్పాటు చేసి 30% ఫిట్మెంట్ వెంటనే ప్రకటించాలని ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావలసిన సరెండర్ లీవ్ బకాయిలను విడుదల చేయాలని సిపిఎస్ విధానాన్ని రద్దుపరిచి పాత పెన్షన్ విధానాన్ని అమలు పరచాలని పదవీ విరమణ చేసిన ఉద్యోగ ఉపాధ్యాయులకు రావలసిన బెనిఫిట్స్ వెంటనే మంజూరు చేయాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ దశల వారి పోరాటంలో భాగంగా 30వ తేదీన స్థానిక తాసిల్దార్ గారికి మెమోరాండం ఇవ్వడానికి ఎక్కువ సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్ దేశానాయక్, మండల శాఖ అధ్యక్షులు కె శామ్యూల్, జిల్లా కార్యదర్శి ఆర్ మాలకొండ నాయక్, జే వెంకటేశ్వర్లు, మురళీ, గోపాల్, పార్థసారథి, దేవప్రసాద్, నరసయ్య, ఆత్మనంద ప్రభాకర్, ఆంజనేయులు, కలాం వాలీబాయి, నాగరాణి, మురళీమోహన్, రత్తయ్య, ఏగయ్య నాయక్, తదితరులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


# బాపట్ల సేవా సేతు ద్వారా జిల్లా ప్రజలకు అభివృద్ధి ఫలాలు

## జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



**(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జనవరి 28)**

"బాపట్ల సేవా సేతు" ద్వారా జిల్లా ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందనున్నాయని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, తెలిపారు. బాపట్ల జిల్లా కొరకు రూపొందించిన ప్రత్యేక వెబ్ సైట్ అమలు తీరుపై సంక్షేమ శాఖల



అధికారులు, వసతి గృహ సంక్షేమాధికారులతో బుధవారం ఆయన స్థానిక కలెక్టరేట్ లో హైబ్రిడ్ మోడ్ లో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో సమస్యలను ప్రజల భాగస్వామ్యంతో పరిష్కారానికి శ్రీకారం చుట్టామని కలెక్టర్ స్పష్టం చేశారు. బాపట్ల.ఈఎల్91.కామ్ అనే వెబ్ సైట్ ను ఆవిష్కరించామన్నారు. ప్రజలందరికీ ఈ వెబ్ సైట్ అందుబాటులోకి తెచ్చామన్నారు. ప్రభుత్వ ఎస్సీ, ఎస్టీ, బిసి వసతి గృహాలలోని విద్యార్థుల సమస్యలను గుర్తించి వెబ్ సైట్ లో నిక్షిప్తం చేయాలన్నారు. మీ విలువైన విరాళాలిచ్చే దాతలకు వేదికగా ఈ వెబ్ సైట్ నిలుస్తుందన్నారు. వెబ్ సైట్ రూపొందించడంలో జి ఎస్ డబ్ల్యూ ఎస్ జిల్లా కోఆర్డినేటర్ పి యశ్వంత్ విశేషంగా కృషి చేశారన్నారు. బాపట్ల జిల్లాకు ప్రత్యేకంగా లోగో రూపొందించాలన్నారు. ప్రజలకు నిరంతరం ఈ వెబ్ సైట్ అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రాథమికంగా ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, బాలసదన్, బదిరుల పాఠశాల విద్యార్థులకు అవసరాలను గుర్తించి నిక్షిప్తం చేయాలన్నారు. ఆ వసతి గృహం చిరునామా, వసతి గృహ సంక్షేమ అధికారి ఫోన్ నెంబర్ వంటి పూర్తి వివరాలు అందులో పొందుపరచాలన్నారు. పూర్వ విద్యార్థుల ఫోన్ నెంబర్లను సేకరించి వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేయాలన్నారు. విరాళాలిచ్చే దాతలు ముందుకు వచ్చి విరాళాలు అందిస్తే వారు అందించిన సహాయ సహకారాలను ఇతరులను ప్రోత్సహించేలా వెబ్ సైట్ లో పొందుపరచాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి కే సత్యనారాయణ, ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి అబ్బులు, బీసీ సంక్షేమ అధికారిని శివలీల, విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ సింగ్, జి ఎస్ డబ్ల్యూ ఎస్ జిల్లా కోఆర్డినేటర్ పి యశ్వంత్, వసతి గృహ సంక్షేమ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ కన్యకా పరమేశ్వరి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో

# "ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్" కార్యక్రమం






(షణ్ముఖ వెలుగు, బద్వేల్, జనవరి 28)

శ్రీ కన్యకా పరమేశ్వరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాయ్స్), బద్వేల్ నందు భారత ప్రభుత్వ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న"ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్" విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమం ద్వారా భారతదేశంలోని భిన్న భాషలు, సంస్కృతులు, సంప్రదాయాల మధ్య పరస్పర అవగాహన పెంపొందించి "భిన్నత్వంలో ఏకత్వం" భావనను బలపరచడం ప్రధాన లక్ష్యం. దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి రెండు రెండు రాష్ట్రాలను ఒక జతగా ఏర్పాటు చేసి ఆ రెండు రాష్ట్రాల మధ్య సంస్కృతి, సాంప్రదాయం, ఆహారపు అలవాట్లు, కట్టుబాట్లు, ఫుడ్ ఐటమ్స్, నృత్య కళలు మొదలగు అంశాలను ఒకరితో ఒకరికి అవగాహన పరుస్తూ ఒకరినొకరు గౌరవించుకునే విధంగా ఈ కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు పంజాబ్ రాష్ట్రం యొక్క చరిత్ర, సంస్కృతి, ఆహారపు అలవాట్లు, పండుగలు మరియు పర్యాటక ప్రదేశాల గురించి సమగ్రంగా వివరించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా పంజాబ్ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు జతగా ఏర్పడి ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. "పంజాబ్" అనే పదం "ఐదు నదుల నేల" అనే అర్థాన్ని సూచిస్తుందని, సట్లేజ్, బియాస్, రవి, చెనాబ్, జీలమ్ నదులు ఈ ప్రాంతాన్ని సుసంపన్నం చేశాయని తెలియజేశారు. అధిక వ్యవసాయోత్పత్తి కారణంగా పంజాబ్‌ను భారతదేశపు "అన్నపూర్ణ భాండారం"గా పిలుస్తారని వివరించారు. విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకున్నాయి. పంజాబ్ సంస్కృతిలో భాగంగా సర్సోం దా సాగ్, మక్కీ ది రోటీ, లస్సీ వంటి వంటకాలు, సల్వార్ కమీజ్, కుర్తా పజామా వంటి సంప్రదాయ దుస్తులు, భాంగ్రా, గిద్దా నృత్యాలు, అలాగే బైసాఖీ, లోహ్రీ, గురుపురబ్ పండుగల ప్రాధాన్యతను విద్యార్థులు వివరించారు. పర్యాటక ప్రదేశాలుగా స్వర్ణ మందిరం (అమృతసర్), జలియన్‌వాలా బాగ్, వాఘా సరిహద్దు, ఆనంద్‌పూర్ సాహిబ్, కపూర్తల షీష్ మహల్ వంటి ప్రసిద్ధ ప్రాంతాలను పరిచయం చేశారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో జాతీయ ఐక్యత, సాంస్కృతిక గౌరవ భావం మరియు దేశభక్తిని పెంపొందించడంలో కీలక పాత్ర పోషించిందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గాజులపల్లి వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్టాఫ్ సెక్రటరీ జి. భారతి, ఉపాధ్యాయులు ఎస్. అనిషా బేగం, ఆర్థర్, కె. శ్రీనివాసులు, చింతంరెడ్డి రామచంద్రారెడ్డి, విద్యార్థులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అధికారులకు సమ్మె నోటీసులు







(షణ్ముఖ వెలుగు, పొదిలి, జనవరి 28)

ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నట్లు అన్ని రంగాలు ప్రతి మండలంలో అధికారులకు బుధవారం సమ్మె నోటీసులు అందించారు. కార్మిక హక్కులను హరించే లేబర్ కోడ్లను రద్దుచేయాలని 29 కార్మిక చట్టాలను పునరుద్దరించాలని, శాశ్వత ఉధ్యోగుల స్థానంలో ఫిక్సిడ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ ప్రవేశపెట్టడాన్ని మానుకోవాలని, కనీస వేతనం, రిటైర్మెంట్ బెనిఫిట్స్, ఉధ్యోగ భధ్రతక కోసం, ప్రభుత్వరంగ సంస్థలను ప్రవేటీకరించరాదని డిమాండ్ చేస్తూ ఫిబ్రవరి 12న దేశవ్యాప్త సమ్మె జరుగుతుంది. ఈ సమ్మెను జయప్రదంచేయాలని అన్ని రంగాలు సమ్మె నోటీసులు అందించారు. ఈ సమ్మెలో పాల్గొనే వివిధ రంగాల కార్మికులు, అంగన్వాడి, ఆశా, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ జెఎసి, మధ్యాహ్న భోజనపథకం, మున్సిపల్, విఓఎ, సివిల్ సప్లై, ఫీల్డ్ అసిస్టెంట్స్, గ్రామపంచాయతీ, స్కూల్ స్వీపర్స్ మొత్తం 10 రంగాల సమ్మె నోటీసులు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ బండి కోటేశ్వరరావు, మధ్యాహ్న భోజన ఏజెన్సీ వరికుంట్ల వినోద్ రాజ్, ఆశాలు, పారిశుధ్య కార్మికులు, సివిల్ సప్లయ్ హమాలీలు పాల్గొన్నారు.

## ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాంగ సహకారంతోనే రెవెన్యూ సమస్యల పరిష్కారానికి కృషి చేశా

### వీడ్కోలు సభలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ



(షణ్ముఖ వెలుగు స్టాఫ్ రిపోర్టర్, ఒంగోలు, జనవరి 28)

ప్రజా ప్రతినిధులు, అధికార యంత్రాంగ సహకారంతో రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించగలిగానని జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ అన్నారు. బదిలీ పై వెళ్తున్న ఆయనకు బుధవారం ప్రకాశం భవనంలో అధికారులు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దాదాపు రెండేళ్లపాటు పనిచేసినట్లు చెప్పారు. వివిధ శాఖలకు సంబంధించి తాను తీసుకున్న నిర్ణయాలు, అధికారులతో ఉన్న పరిచయాలను ఈ సందర్భంగా ఆయన గుర్తు చేసుకున్నారు. కలెక్టర్ పి రాజాబాబు మాట్లాడుతూ జిల్లాలోని రెవెన్యూ సమస్యలను పరిష్కరించడంలో గోపాలకృష్ణ తనదైన ముద్ర వేశారని అభినందించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ బి చిన ఓబులేసు, కందుకూరు సబ్ కలెక్టర్ హిమ వంశీ, కనిగిరి, ఒంగోలు, మార్కాపురం ఆర్డీవోలు కేశవర్ధన్‌రెడ్డి, లక్ష్మీ ప్రసన్న, శివరామిరెడ్డి, పలువురు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, వినియోగదారుల ఫోరం ప్రతినిధులు, ప్రజా సంఘాల నాయకులు పాల్గొని ప్రసంగించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ దంపతులను అధికారులు ఘనంగా సత్కరించారు.

## బాలోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

### పోస్టర్‌ను ఆవిష్కరించిన యూటిఎఫ్, జన విజ్ఞాన వేదిక నాయకులు




(షణ్ముఖ వెలుగు, గిద్దలూరు, జనవరి 28)

గిద్దలూరు పట్టణంలోని యూటిఎఫ్ ఆఫీస్‌లో జిల్లా కార్యదర్శి డాక్టర్ మొర్రి పిచ్చయ్య అధ్యక్షతన ప్రకాశం బాలోత్సవ ప్రిప్రెటరీ మీటింగ్ జరిగింది. ఈ కార్యక్రమం యూటిఎఫ్, జన విజ్ఞాన వేదిక సంయుక్తంగా నిర్వహించనున్నందున జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు స్వరూప రెడ్డి, జిల్లా నాయకులు మండ్ల శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, విశ్వరూపాచారి హాజరయ్యారు. జిల్లా కార్యదర్శి పిచ్చయ్య మాట్లాడుతూ ప్రకాశం బాలోత్సవ కార్యక్రమం ఫిబ్రవరి నెల 7 ,8 తేదీలల్లో ఒంగోలు నగరంలోని పి.వి.ఆర్. మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించనున్నారని, ఈ కార్యక్రమంలో అన్ని మేనేజ్మెంట్ల పాఠశాలల్లో చదువుతున్న 2 నుంచి 10.వ తరగతి విద్యార్థులు పాల్గొనవచ్చునని తెలిపారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు స్వరూప రెడ్డి మాట్లాడుతూ అకాడమిక్ ఈవెంట్, కల్చరల్ ఈవెంట్ విభాగాలు ఉంటాయని,ప్రతి విభాగంలో ప్రధమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తామని, ఆసక్తిగల విద్యార్థులు అప్లికేషన్ పంపించడానికి చివరి తేదీ 2 ఫిబ్రవరి అని తెలిపారు. ఈ సమావేశానికి హాజరైన యూ.టీ.ఎఫ్ గిద్దలూరు, రాచర్ల, కొమరోలు మండలాల అధ్యక్షులు కార్యక్రమం విజయవంతం కావడానికి తమ సహకారం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ రమణారెడ్డి, జిల్లా కార్యదర్శి మాధవి దేవి, జిల్లా మాజీ కార్యదర్శి సత్యనారాయణ రెడ్డి, జిల్లా సి.పి.ఎస్ కన్వీనర్ ఆవుల రాజు, కుటుంబ సంక్షేమ డైరెక్టర్ వేమయ్య, ఆడిట్ కమిటీ మెంబర్ శ్రీనివాసులు, గిద్దలూరు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామచంద్రారెడ్డి, బాల వెంకటేశ్వర్లు, రాచర్ల మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రఘురాం, రంగారెడ్డి,కొమరోలు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వరరావు, కృష్ణారెడ్డి, ఉపాధ్యక్షులు ఖాదర్, ట్రెజరర్ హరికుమార్, సీనియర్ నాయకులు జయచంద్రారెడ్డి, కాశయ్య, సుబ్బరాయుడు, రఘురామిరెడ్డి, నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగితే చర్యలు







(షణ్ముఖ వెలుగు, ఉలవపాడు, జనవరి 28)

మండలం ోని కరేడు రైల్వే గేట్, అలగాయపాలెం రైల్వే గేట్ సమీపంలోని ఓపెన్ ప్లాట్స్ వద్ద బహిరంగంగా మద్యం తాగుతున్న ప్రదేశాలపై బుధవారం ఉలవపాడు పోలీసులు దాడులు నిర్వహించారు. బహిరంగంగా మద్యం తాగే ప్రదేశాలను స్థానికుల సాయంతో శుభ్రం చేయించి తగలబెట్టించడం జరిగింది. కరేడు రైల్వే గేట్, అలగాయపాలెం రైల్వే గేట్ సమీప ప్రాంతాల్లో ఎవరైనా మద్యం తాగి పట్టుపడితే క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుంది. ఎవరైనా బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగుతూ స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తుంటే స్థానిక పోలీసులకు లేదా డైల్ - 112 కి సమాచారం ఇవ్వగలరు. ఉలవపాడు ఎస్ఐ జి సుబ్బారావు తెలిపారు.

## 31వ తేదీన నగదు పంపిణీకి అధికారులు సిద్ధం కావాలి



(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జనవరి 28)

ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం లబ్ధిదారులకు ఈనెల 31వ తేదీన నగదు పంపిణీకి అధికారులు సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకం అమలు తీరుపై జిల్లాస్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులతో బుధవారం ఆయన హైబ్రిడ్ మోడ్ లో సమావేశం నిర్వహించారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకానికి అవసరమైన నగదును ఈనెల 30వ తేదీన బ్యాంకుల నుంచి డ్రా చేయాలని ఎండిఓలను కలెక్టర్ ఆదేశించారు. ఫిబ్రవరి ఒకటో తేదీన ఆదివారం సెలవు దినం కావడంతో ముందు రోజే నగదు పంపిణీ చేపట్టాలన్నారు. ఉదయం 6:30 గంటలకు పింఛన్ నగదు పంపిణీ ప్రక్రియ జిల్లా వ్యాప్తంగా ప్రారంభం కావాలని సూచించారు. లబ్ధిదారులు అందుబాటులో లేని పక్షంలోనే మిగిలిన పోయిన వారికి ఫిబ్రవరి రెండో తేదీన నగదు పంపిణీ చేయాలన్నారు. ప్రతి మండలంలో నూరు శాతం పింఛన్ పంపిణీ జరగాలని ఆదేశించారు. వేటపాలెం మండలంలో పింఛన్ పంపిణీ ప్రారంభించడంలో 67 మంది సిబ్బంది జాప్యం చేస్తుంటే పట్టించుకోకపోవడం ఏమిటని నిలదీశారు. పర్యవేక్షణ లోపం కింద సదరు ఎంపీడీవో కి, వేటపాలెం మండలం ఎంపీడీవోకి షోకాస్ నోటీసులు జారీ చేయాలన్నారు. అలాగే నిజాంపట్నం మండలంలో స్వరూప రాణి కేవలం 56 శాతం పింఛన్ పంపిణీ చేయడంపై ఆరా తీశారు. నూరు శాతం పంపిణీ చేయాల్సి ఉండగా, 56 శాతం మించకపోవడం ఏమిటని ప్రశ్నించారు. పింఛన్ నగదు పంపిణీలో నిర్లిప్తంగా వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. లబ్ధిదారులకు ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలన్నారు. ఐ వి ఆర్ ఎస్ ద్వారా ప్రజల అభిప్రాయాన్ని ప్రభుత్వం సేకరిస్తున్న నేపథ్యంలో నిబద్ధతతో విధులు నిర్వహించాలని పలు సూచనలు చేశారు. ఆరోపణలు వస్తే వారిపై క్రమశిక్షణ చర్యలు ఉంటాయన్నారు. ఈ సమావేశంలో డిఆర్డిఏ పిడి బి సింగయ్య, ఆయా మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు, తదితరులు పాల్గొన్నారు.



## పొగాకు బ్యారన్ దగ్ధం రూ.5 లక్షల ఆస్తి నష్టం



(షణ్ముఖ వెలుగు, మర్రిపూడి, జనవరి 28) మండలంలోని గుండ్లసముద్రం గ్రామంలో పరిమి వెంకటేశ్వర్లు రైతుకు చెందిన బ్యారన్ ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో దాదాపు రూ.5 లక్షల రూపాయల ఆస్తి నష్టం సంభవించినట్లు తెలిసింది. ప్రభుత్వం ఆదుకొని రైతుకు నష్టపరిహారం అందించాలని రైతు కోరుతున్నాడు.

## తండ్రి కూల్ డ్రింక్ షాప్... తనయుడికి గ్రూప్ 2 ఉద్యోగం



(షణ్ముఖ వెలుగు, పొదిలి, జనవరి 28) పొదిలి పట్టణానికి చెందిన షేక్ బికారి సాహెబ్ గత 30 ఏళ్లుగా కూల్ డ్రింక్ షాప్ పెట్టుకొని జీవనం సాగిస్తూ, కుటుంబాన్ని పోషిస్తున్నారు. బికారి సాహెబ్‌కు ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. కుమారుడు షేక్ అర్షద్‌ను కష్టపడి చదివించాడు. కుమారుడు ఉన్నత స్థానంలో ఉండాలనే ఆశ, పట్టుదలతో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా చదివించాడు. అంతే బాధ్యత కలిగిన అర్షద్ ఎంతో చక్కగా చదివాడు. తల్లిదండ్రుల రుణం తీర్చుకునే సమయం వచ్చింది. తాజాగా విడుదలైన గ్రూప్ 2 ఫలితాలలో ఏఎస్ఓ (జిఏడి)గా ఎంపికయ్యారు. దీంతో షేక్ బికారి సాహెబ్ వారి ఇంట్లో కుటుంబసభ్యులు, బంధు మిత్రులు పట్టరాని ఆనందంతో ఉన్నారు. ఈ సందర్భంగా అర్షద్‌ను తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు అభినందించారు.

## గ్రూప్ 2 ఫలితాలలో మెరిసిన తర్లుపాడు యువ కెరటాలు





(షణ్ముఖ వెలుగు, తర్లుపాడు, జనవరి 28) రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గ్రూపు 2 ఫలితాలలో మండల కేంద్రమైన తర్లుపాడు గ్రామానికి చెందిన షేక్ హబీద్ హుస్సేన్ (ఏఎస్ఓ) అసిస్టెంట్, సెక్షన్, ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించడం జరిగింది. దీంతో ఆయన తండ్రి రిటైర్డ్ ఉపాధ్యాయుడు దాదా పీర్ సాహెబ్ కుటుంబ సభ్యులు ఆనందంతో సంబరాలు జరుపుకున్నారు. ఇదే గ్రామం ఎస్సీ పాలానికి చెందిన మెండెం ఉదయ్ కిరణ్ ప్రస్తుతం కొనకనమిట్ల మండలంలోని సిద్దవరం గ్రామ పంచాయతీలో సెక్రటరీగా విధులు నిర్వహిస్తున్నారు. ఈయనకు గ్రూప్2లో పశుసంవర్ధ శాఖలో ఉద్యోగం సాధించడం జరిగింది. దీంతో ఆయన తండ్రి మెండెం ఏసుదాసు కుటుంబీకులు, బంధు మిత్రులు ఆనందమయంలో మునిగిపోయారు. వీరందరూ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

## మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన గాదె



(షణ్ముఖ వెలుగు, ఇంకొల్లు, జనవరి 28) తాడేపల్లిలోని వైసీపీ కేంద్ర క్యాంపు కార్యాలయంలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని పర్చూరు నియోజకవర్గ వైసీపీ ఇంచార్జి గాదె మధుసూదన్‌రెడ్డి బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఏర్పాటు చేయనున్న గ్రామ కమిటీల గురించి వివరించారు. అలాగే నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి చేపట్టిన కార్యక్రమాలను తెలియజేశారు.గాదె మధుసూదన్‌రెడ్డితో పాటు కారంచేడు మండల అధ్యక్షులు జువ్వా శివరామ్ ప్రసాద్, స్టేట్ యూత్ వింగ్ జాయింట్ సెక్రటరీ ఉప్పలపాటి అనిల్ చౌదరి, సీనియర్ నాయకులు కొసన రాము, జిల్లా రైతు విభాగం కార్యదర్శి సింహాద్రి బ్రహ్మారెడ్డి, ముప్పవరపు శ్రీరాములు, తదితరులు వున్నారు.

# ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలి






(షణ్ముఖ వెలుగు, గోపవరం, జనవరి 28) ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు న్యాయమైన సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కొండూరు శ్రీనివాసరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం అట్లూరులో జరిగిన నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత పి ఆర్ సి గడువు ముగిసి ఇప్పటికే రెండు సంవత్సరాల ఆరు నెలల కాలం పూర్తి అయ్యి నందున, జూలై 2023 నుంచి ఉద్యోగ ఉపాధ్యాయులకు నూతన పిఆర్ సి అమలు చేయవలసి ఉన్నందున, ఉద్యోగులు ప్రభుత్వంపై పెట్టుకున్న ఆశలను వమ్ము చేయకుండా, సంక్రాంతి కానుకగా వెంటనే పిఆర్సి కమిషన్ నియమించి మధ్యంతర భృతిని ప్రకటించాలని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. ఎన్నికల హామీతో పాటు ఇటీవల ఉద్యోగ సంఘాలకు ముఖ్యమంత్రి పిఆర్‌సి, మధ్యంతర భృతిపై స్పష్టమైన హామీ ఇచ్చినందున, హామీ నెరవేర్చే దిశగా ప్రభుత్వం కృషి చేయాలని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా ప్రస్తుతం సంక్రాంతి కానుకగా ప్రభుత్వం సిపిఎస్ ఉద్యోగులకు విడుదల చేసిన 2018 వ సంవత్సర కరువు బత్యం బకాయిలు చాలామంది ఉద్యోగులకు తమ ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలలోను , సి పీ ఎస్ ఉద్యోగులకు నగదు రూపంలో జమ కాలేదని అలాంటివారికి తిరిగి బిల్లు పెట్టుకునే విధంగా ప్రభుత్వం అవకాశం కల్పించాలన్నారు .ఈ విద్యా సంవత్సరంలో మిగిలిన నాలుగు ఐచ్ఛిక సెలవులు వ్యక్తిగతంగా కాకుండా గతంలో లాగా పాఠశాల మొత్తానికి ఇచ్చే విధంగా అధికారులు పునరాలోచించాలని కోరారు. సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులకు టెట్ అర్హతను రద్దు చేయాలని, బదిలీల చట్టం అనుసరించి పదోన్నతులకు , బదిలీలకు షెడ్యూల్ విడుదల చేయాలని, పంచాయితీరాజ్ శాఖ లాగా విద్యా శాఖలో కూడా ప్రత్యేక క్యాడర్ లను సృష్టించడం లేదా ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారానైనా కామన్ సర్వీస్ రూల్స్ ద్వారా విద్యాశాఖలో ఉన్న అన్ని క్యాడర్లకు పదోన్నతులు ఈ విద్యా సంవత్సరంలో జరిగేలా కృషి చేయాలని ఆయన ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని కోరారు. అట్లూరు ఎంఆర్సి నందు ఎన్ టి ఏ మండల అధ్యక్షుడిగా ప్రాథమిక పాఠశాల మల్లినేనిపట్నం లో పనిచేస్తున్న కట్టా కృష్ణయ్యను, ప్రధాన కార్యదర్శిగా ప్రాథమిక పాఠశాల దిన్నెమీద పల్లెలో పని చేస్తున్న పోకల రమణారెడ్డిని, ఆర్థిక కార్యదర్శిగా ఉన్నత పాఠశాల అట్లూరు నందు తెలుగు స్కూల్ అసిస్టెంట్ గా పనిచేస్తున్న పాండురంగయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ తమ దృష్టికి వచ్చిన ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరిస్తామని అదేవిధంగా మండల విద్యాభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌టిఏ రాష్ట్ర కౌన్సిలర్ మానుగుంట రవిశంకర్, జిల్లా గౌరవాధ్యక్షులు కూరాకు రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

# ఇప్పగుంట, చౌటపాలెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది




(షణ్ముఖ వెలుగు, పొన్నలూరు, జనవరి 28) మండలంలోని ఇప్పగుంట, చౌటపాలెం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం వి రాము ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా రైతు సేవకేంద్రాలలో గ్రామ వ్యవసాయ సహాయకులు ద్వారా మీ ఆధార్ కార్డు మరియు పట్టాదారు పాసు బుక్ ఆధారంగా ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకొన్నచో వారికీ ఒక యూనిక్యూ నెంబర్ వస్తుందని తద్వారా రాబోయే రోజుల్లో వ్యవసాయ శాఖ ద్వారా అన్నీ పథకాలు లబ్ధి పొందవచ్చునని తెలిపారు. రైతులు ఒకే పంట మీద ఆధారపడకుండా ఆదాయం వచ్చే చిరుధాన్యాలను పండించుకోవాలని సూచించారు. రైతులకు అన్ని రకాల ఎరువులు అందుబాటులో ఉన్నాయని,పై పాటుగా యూరియా ఎరువులకు బదులు నానో యూరియా, డిఏపికి బదులు నానో డిఏపి వాడాలని తెలియజేశారు. రైతులందరూ వేసిన పంటలన్నింటికీ పంట నమోదు గ్రామ వ్యవసాయ సహాయకులు ద్వారా చేసుకోవాలని తెలియజేశారు. ఒంగోలు జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయధికారి వి శేషమ్మ మాట్లాడుతూ పొగకు పంటలో ప్రస్తుతం పెనుబంక ఉద్రితి ఎక్కువగా ఉందని ఇది ఆకుల అడుగుభాగంలో వందల కొద్దీ ఆశించి ఆకుల రసాన్ని పీల్చి ఆకులు క్షినించి, రోశెట్టి లేక బుషి టాప్ వ్యాధులు సోకుతాయని, ఒక విధమైన తేనె వంటి బంకను ఆకులపై వదలడం వలన ఆకులపై నల్లటి బూజు ఏర్పడి ఆకులు క్యూరింగ్ కి పనికిరాకుండా పోతాయని తెలిపారు. పెనుబంక నివారణకు థయోమెతోక్సిమ్ 40గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 200 ఎస్ ఎల్. 50మి. లీ లేదా పైమెట్రోజెన్ 80 గ్రాములు లేదా ప్లానికామీడ్ 80 గ్రాములు ఒక ఎకరానికి సాయంత్రం వేళలో మందులు వరకు రోజుల వ్యవదిలో మార్చి మార్చి పిచికారీ చేసి నివారించవచ్చునని తెలియజేసారు. పై కార్యక్రమంలో పొన్నలూరు వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులు కొండలరావు, ఇప్పగుంట పంచాయతీ కార్యదర్శి భారతి, గ్రామ ఉద్యాన సహాయకురాలు ఐ బ్రాహ్మిని, ఎంపి ఇఓ నాగరాజు, చౌటపాలెం గ్రామ వ్యసాయ సహాయకులు, రెండు గ్రామాల ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి తైక్వాండో పోటీల్లో సత్తా చాటిన చిన్నారులు

## చిన్నారులను అభినందించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్




(షణ్ముఖ వెలుగు, బాపట్ల, జనవరి 28) జాతీయ స్థాయిలో రాజస్థాన్ రాష్ట్రం జైపూర్ పట్టణంలోని ఎస్ఎమ్ఎస్ ఇండోర్ స్టేడియంలో జనవరి 18 నుండి 23వ తేదీ వరకు నిర్వహించిన ఇండియా తైక్వాండో థర్డ్ కిడ్స్ ఛాంపియన్ ఆఫ్ ఛాంపియన్స్ 20252026 పోటీలలో బాపట్ల జిల్లాలో ఏఆర్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న 2013 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుల్ మల్లెల విజయ్ బాబు కుమార్తె రంజయు లోచన్, కుమారుడు నిక్షిప్త విజయ్ మెడల్స్ సాధించారు. కలెక్టరేట్లో చిన్నారులను కలెక్టర్ వినోద్ కుమార్ ప్రత్యేకంగా అభినందించి, సాధించిన పతకాలను అందజేశారు. మల్లెల విజయ్ బాబు కుమారుడు రంజయు లోచన్ (9 సం), కుమార్తె నిక్షిప్త విజయ్ (7 సం)లు గత సంవత్సరం డిసెంబర్ 27, 28 తేదీలలో గుంటూరు జిల్లా తెనాలి పట్టణంలో తైక్వాండో అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెకండ్ ఏపీ స్టేట్ కిడ్స్ అండ్ ఫెడరేషన్ కప్2025 లో ఇరువురు గోల్డ్ మెడల్స్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. జాతీయ స్థాయిలో జనవరి 18 నుండి 23వ తేదీ వరకు రాజస్థాన్ రాష్ట్రం జైపూర్ పట్టణంలోని ఎస్ఎమ్ఎస్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఇండియా తైక్వాండో థర్డ్ కిడ్స్ ఛాంపియన్ ఆఫ్ ఛాంపియన్స్ 20252026 పోటీలలో ఇరువురు సత్తా చాటారు. రంజయు లోచన్ రజత పతకం, నిక్షిప్త విజయ్ కాంస్య పతకం సాధించారు. భవిష్యత్తులో ఈ చిన్నారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించి మంచి గుర్తింపుతో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.




On behalf of PRINTER, PUBLISHER OWNED BY OBULASETTY RADHAKRISHNA DASS AND PRINTED AT HARI PRINTERS AND PUBLICATIONS, FLOT 51, NEAR B.V.SUBBAIAH SCHOOL ROAD, PERNAMITTA, SANTANUTALAPADU (MANDAL), PRAKASAM/ONGOLE (Dt), ANDHRA PRADESH, PIN : 523225. Mobile : 9494177939, RNI : APTEL/2023/89152, e-mail : rkreport9@gmail.com. E-Paper : shanmukhavelugu.com